




# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 359, పేజీలు - 08

శుక్రవారం, మే 23, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati







## మై డియర్ డాడీ అంటూనే దాడి



### - కేసీఆర్‌కు కవిత లేఖ రాసినట్లుగా జోరుగా ప్రచారం

- ఉలిక్కిపడ్డ బీఆర్ఎస్ శ్రేణులు
- రజతోత్సవ సభానంతరం వెలుగులోకి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ
- సభలో బీజేపీపై కేసీఆర్ పరిమిత విమర్శలతో పొత్తు ఊహాగానాలు మొదలయ్యాయని ప్రస్తావన
- రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేయకపోవడంపై ప్రశంసలు వచ్చాయని వెల్లడి
- క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యం, బీజేపీ ప్రత్యామ్నాయమనే భావన శ్రేణుల్లో ఉందని వెల్లడి
- కేసీఆర్ అందరికీ అందుబాటులో ఉండాలని, పార్టీ ప్లీనరీ నిర్వహించాలని కవిత విజ్ఞప్తి

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసినట్లుగా చెబుతున్న ఒక లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ లేఖలో వరంగల్ సభ నిర్వహణపై అసంతృప్తి, బీజేపీపై మరింత బలంగా మాట్లాడాల్సిన అవసరం, బీజేపీతో భవిష్యత్ పొత్తు ప్రచారాలపై ఆందోళన వంటి అంశాలు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చామనే సందేశాన్ని కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లిందని, పార్టీకి స్పష్టమైన వ్యూహాలు, ప్లీనరీ సమావేశాలు అవసరమని కవిత సూచించినట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖపై కవిత ఇంకా స్పందించలేదు.**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసినట్లుగా చెబుతున్న ఒక లేఖ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఈ లేఖలోని అంశాలు బీఆర్ఎస్ పార్టీ అంతర్గత పరిస్థితులు, భవిష్యత్ వ్యూహాలపై అనేక ఊహాగానాలకు తావిస్తున్నాయి. అయితే.. ఈ లేఖ ప్రామాణికతపై కవిత ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మే రెండో తేదీన ఆరు పేజీల్లో రాసినట్లు ఉన్న ఈ వైరల్ లేఖలో కవిత 2లో..

## ఈడీ హద్దులు దాటుతోంది

### - సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

- అన్ని హద్దులూ మీరుతోందంటూ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం
- తమిళనాడు మద్యం కేసులో ఈడీ దర్యాప్తుపై స్టే - డీఎంకే ప్రభుత్వ పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై సుప్రీం కోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ అధికారులు అన్ని హద్దులు దాటుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ దాడుల పేరుతో వేధిస్తోందని పేర్కొంటూ తమిళనాడు సర్కారు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై ఈ విధంగా స్పందించింది. తమిళనాడు 2లో..



## రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి

### - పంటల గిట్టుబాటు ధరపై సీఎం సమీక్ష



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వరీసాగు, ఆయా పంటల సాగు ప్రణాళికలపై వ్యవసాయశాఖ అధికారులు దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. పంటలు, గిట్టుబాటు ధరలపై గురువారం సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. కేబినెట్ సబ్ కమిటీతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లు ఎలా ఉన్నాయో ఏ పంటలు సాగుచేయాలో రైతులకు ముందే చెప్పాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డిమాండ్ ఉన్న పంటలను మాత్రమే సాగయ్యేలా చూసి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. హెచ్డీ బర్లీ పొగాకు మెట్రిక్ టన్నుకు రూ.12,000, కోకో కేజీకి రూ.500 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. పొగాకు, కోకో పంటలను ఆయా కంపెనీలు కొనుగోళ్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 2లో..

## జూన్ 4న వెన్నుపోటు దినం

### - కూటమి సర్కారుపై జగన్ ఇచ్చిన ప్రోగ్రెస్ రిపోర్ట్

- ఏడాది కాలంలోనే చంద్రబాబు రూ.1.37 లక్షల కోట్ల అప్పు చేశారన్న జగన్
- రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం, సంక్షేమం కనుమరుగని విమర్శ
- లిక్కర్, ఇసుక, మైనింగ్‌లో భారీగా మాఫియా నడుస్తోందని వ్యాఖ్య
- కొన్ని మీడియా సంస్థలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన జగన్
- విద్యుత్ కొనుగోళ్లలోనూ పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపణ

**అమరావతి (ప్రశ్న న్యూస్)** చంద్రబాబు సర్కారు పూర్తిగా కుంభకోణాల్లో కూరుకుపోయిందని ఆరోపించారు వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాజధాని అమరావతి నుంచి ఇసుక వరకు అన్నింటిలో స్కామ్‌లు నడిపిస్తున్నారని అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జగన్ చంద్రబాబు ఏడాది పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారు. అవినీతి, స్కాములు, దోపిడీ, అప్పులు, రెడ్‌బుక్ రాజ్యాంగం, బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. సంపద సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు విపరీతంగా దోపిడీకి పాల్పడుతున్నారని జగన్ విమర్శలు చేశారు. పాలనలోకి వచ్చి ఏడాది అయినా సంపద సృష్టించకపోవడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందన్నారు. సంక్షేమం పూర్తిగా ఆగిపోయిందని వెల్లడించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం ప్రకటనలు, మోసాలు, ప్రత్యర్థులపై ఆరోపణలతోనే కాలం గడిపారని 2లో..



## జీవన్ రెడ్డి దెబ్బకు కాంగ్రెస్ రెండు ముక్కలు కానుందా.?

### - సీఎం రేవంత్ రెడ్డికి కొత్త తలనొప్పి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు మధ్య వార్ పార్టీకి కొత్తకాదు. అలకలు , బహిరంగ విమర్శలు, బాహాబాహీ బలప్రదర్శనలు సర్వసాధారణం. ఇన్ని జరిగినా, జరుగుతున్నా తెలంగాణలో రేవంత్ సారథ్యంలో అధికారం చేపట్టి అలా ముందుకు సాగుతోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తాజాగా కరీంనగర్ జిల్లా జగిత్యాల నియోజకవర్గంలో జరుగుతున్నరాజకీయ రచ్చ సీఎం రేవంత్ రెడ్డికి కొత్త తలనొప్పిగా మారింది. కొందరు రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు జీవన్ రెడ్డి నియోజకవర్గం అంటేనే హడలిపోతున్నారు. అక్కడ సొంతపార్టీలో వర్గపోరులో తామెందుకు ఇరుక్కోవడం అనుకుని జగిత్యాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా మంత్రి పొంగులేటి ముందే జీవన్ రెడ్డి 2లో..

## కేసీఆర్‌కు నోటీసుల వెనుక కుట్ర

### - రేవంత్‌కు మల్టిపుల్ పర్సనాలిటీ డిసార్డర్

- తెలంగాణ కష్టాల్లో ఉంటే సీఎం రేవంత్ రెడ్డి గ్లామర్‌కే ప్రాధాన్యం
- సీఎం తీరు విపరీతం, ప్రాధాన్యాలు గాలికి, రాజకీయ నిజాయతీ శూన్యం
- 580 మంది రైతుల ఆత్మహత్యలు, పంట నష్టం పట్టించుకోని సీఎం
- అందాల పోటీలకు రూ.200 కోట్లు, ఖజానా ఖాళీ అంటూ ప్రచారం
- కాళేశ్వరంపై నోటీసులు కక్ష సాధింపు, కమీషన్ల కోసమేనని ఆరోపణ
- మిస్ వరల్డ్ బృందానికి చూపినవన్నీ బీఆర్ఎస్ కట్టినవేనన్న కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రజాపాలన పర్సంటేజీ పాలనగా మారింది దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సమయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పైన చేసిన దుష్ప్రచారం తేలిపోయింది నిన్నటి సుప్రీంకోర్టు సాక్షిగా నిజాలు బయటకు వచ్చాయన్నారు. ఈ కాంగ్రెస్ బిజెపి కలసి కాలేశ్వరం పై చేస్తున్న దుష్ప్రచారం కూడా త్వరలో తేలిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కాలేశ్వరం ప్రాజెక్టుపై నికృష్టమైన, నీచమైన రాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కమిషన్లు బయటపడుతున్నాయని తెలిసాకే ఇప్పుడు నోటీసుల పేరిట తమాషాలు చేస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై వ్యాఖ్యానించిందని గుర్తు చేశారు. జస్టిస్ ఘోష్ విచారణ పూర్తయిందన్నారు. 2లో..

## దేశంలో మళ్లీ కరోనా అలజడి

### - పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కోవిడ్-19 బాధితుల సంఖ్య క్రమంగా అధికమవుతుండటంతో ఆరోగ్య శాఖ అధికారులు నిఘా పెంచి, ముందుజాగ్రత్త చర్యలు ముమ్మరం చేశారు. అయితే, ప్రస్తుతానికి నమోదవుతున్న కేసులన్నీ స్వల్ప లక్షణాలతోనే ఉన్నాయని, ఎటువంటి మరణాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ, ముంబై, చెన్నై, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాల్లో కేసుల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఒక్క ముంబై నగరంలోనే మే నెలలో 95 2లో..

## ఇక్కడ మోదీ ఉన్నారనే సంగతి మరిచిపోద్దు

### - పాకిస్థాన్‌కు మోదీ మార్క్ వార్నింగ్

**జైపూర్ (ప్రశ్న న్యూస్)** పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. రాజస్థాన్‌లోని బికనీర్‌లో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను కేవలం 22 నిమిషాల్లోనే ధ్వంసం చేశామని తెలిపారు. "ఏప్రిల్ 22 నాటి దాడికి ప్రతిస్పందనగా మే 7న చేపట్టిన ఆపరేషన్‌లో ఉగ్రవాదులకు చెందిన 9 అతిపెద్ద స్థావరాలను 22 నిమిషాల్లో ధ్వంసం చేశాం. సిందూరం తుపాకీ మందుగా మారితే ఏం జరుగుతుందో శత్రువులకు చూపించాం" అని ప్రధాని మోదీ చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ ప్రతీకార చర్యలో జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలకు 2లో..



## ఏ విచారణకైనా సిద్ధమని జగన్ ఎందుకు చెప్పడం లేదు



### - నిర్దోషిత్వం నిరూపించుకోండి అంటూ జగన్ కు షర్మిల హితవు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత జగన్ పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మద్యం కేసులో తాను నిర్దోషినని చెబుతున్న జగన్, తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి గారిలా 'తప్పుంటే ఉరితీయండి' అని ధైర్యంగా ఎందుకు ప్రకటించడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పలేని పరిస్థితిలోనే జగన్ ఉన్నారని షర్మిల ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం విధానానికి సంబంధించి వస్తున్న ఆరోపణలపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పందిస్తూ, తాను ఏ తప్పూ చేయలేదని 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో మళ్ళీ ఎన్‌కౌంటర్

### - బీజాపూర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతం

**ఛత్తీస్‌గఢ్ (ప్రశ్న న్యూస్)** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. తాజాగా బీజాపూర్ జిల్లాలోని పీడియా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఇంకా కాల్పులు జరుగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాగా, బుధవారం నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో 2లో..



# ఈడీ హద్దులు దాటుతోంది

ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్ తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్‌పై ఈడీ అధికారులు ఇటీవలే సోదాలు జరిపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే దీనిపై సుప్రీం కోర్టు తాజాగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ అన్ని హద్దులు దాటుతోందని ఆక్షేపించింది. సమాఖ్య పాలన భావనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఉల్లంఘిస్తున్నారన్ని పేర్కొంది. తమిళనాడు ప్రభుత్వ విభాగం టస్మాక్‌పై జరుగుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించింది.టాస్మాక్‌లో రూ.1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈడీ చెబుతోంది. ఈ ఏడాది మార్చిలో తొలిసారి ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. మే నెలలోనూ మళ్లీ టాస్మాక్ అధికారుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టింది. టాస్మాక్‌లో జరుగుతున్న అవకతవకలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.
ఈడీ దాడులు ఆపాలంటూ తమిళనాడు సర్కారు హైకోర్టుకు వెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే టాస్మాక్‌లో సోదాలు నిర్వహిస్తోందని, విచారణ పేరు చెప్పి టాస్మాక్ అధికారులను వేధిస్తోందని చెప్పుకొచ్చింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు దానిని కొట్టి వేసింది. ఈడీ దర్యాప్తు చేసుకోవచ్చని చెప్పింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీం కోర్టుకు వెళ్లాయి. దీనిపై తాజాగా సుప్రీం కోర్టు విచారణ జరిపింది. ఈడీ తీరును సుప్రీం కోర్టు తప్పుబట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ దర్యాప్తు సంస్థకు నోటీసులు జారీ చేసింది. సుప్రీం ఉత్తర్వులపై డీఎంకే హర్షం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు చేస్తున్న కుట్రలకు ఇది చెంపపెట్టు లాంటిదని దుయ్యబట్టింది. బిజెపి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించింది.

# రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి

పంటకు మద్దతు ధర కన్నా తగ్గితే రైతులను నేరుగా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. హెచ్డీ బర్లే – వైట్ బర్లే పొగాకును టొబాకో బోర్డులో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని చెప్పారు. రైతులు నష్టపోకుండా ఈ ఏడాది హెచ్డీ బర్లే పొగాకు రకానికి క్రాప్ హాలీడే ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్యూర్ జ్యూస్‌లపై జీఎస్టీ తగ్గింపునకు కృషి, మిడ్ డే మీల్స్, టీటీడీ ప్రసాదంగా మ్యాంగో జ్యూస్ ఇస్తున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# కేసీఆర్‌కు నోటీసుల వెనుక కుట్ర

అయితే మళ్లీ ఎందుకు పొడిగించారు? ప్రభుత్వం చెప్పాలన్నారు. కాలేశ్వరం నోటీసులు ఇప్పటిదాకా నేరుగా అందినట్టు సమాచారం లేదని తెలిపారు. అందిన తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని బ్యారేజీలను కూలగొట్టి మళ్లీ టెండర్ల పిలిచి, 20% నుంచి 30% కమిషన్లు తీసుకోవాలన్నదే అసలు ఏజెండా అని కేటీఆర్ ఆరోపించారు. సుప్రీంకోర్టుకు కాళేశ్వరం ప్రాధాన్యత, గొప్పతనం అర్థమైంది. సెంట్రల్ వాటర్ కమిషన్‌కు అర్థమైంది, అందుకే 'ఇరిగేషన్ మార్వెల్' అన్నారన్నారు. న్యాయమూర్తులకు అర్థమవుతుంది, కానీ ఇక్కడ అధికారంలో ఉన్న అజ్ఞాని ముఖ్యమంత్రికి అర్థమవడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి పై ముఖ్యమంత్రి చేసిన కుట్రలు విఫలమయ్యాయని.. పాలమూరు-రంగారెడ్డిని వెంటనే పూర్తిచేసి మహబూబ్‌నగర్ ప్రజలకు సాగునీరు ఇవ్వాలని మన జిల్లా ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. 'పాలమూరు బిడ్డ'ను చెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును ఎందుకు పక్కన పెట్టారని ప్రశఅనించారు. పాలమూరులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్టే, కాళేశ్వరంపైన కూడా స్పష్టమైన తీర్పులు వస్తాయి. కాలేశ్వరం ప్రాధాన్యతను ప్రజలకు, ఈ మూర? కాంగ్రెస్ నాయకులకు అర్థమయ్యేలా చెబుతాయమన్నారు. 580 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ముఖ్యమంత్రి అందాల పోటీలో ఉండడం కరెక్టా? అని ప్రశ్నించారు. అన్నదాతల ధాన్యం వర్షంలో కొట్టుకుపోతుంటే, అందాల పోటీలకు రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద ప్రమాదం జరిగితే ఒక్కసారి పోనీ రేవంత్ రెడ్డి అందాల పోటీలకు నాలుగు సార్లు పోయాడని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ దగ్గర ఒక రూపాయి కూడా లేదు అని చెప్పి, అందరూ దొంగలలాగా చూస్తున్నారంటూ రెండువందల కోట్ల రూపాయలు అందాల పోటీలకు ఖర్చు పెట్టడం కరెక్ట్ కాదన్నారు.మిస్ వరల్డ్ కాంటెస్టులకు మంత్రులంతా టూర్ గైడ్లుగా మారిపోయారు. మంత్రులు సొంగ గాడ్చుకుంటూ అందాల పోటీలో పాల్గొంటున్నారని సిపిఐ నారాయణ అన్నారు. మిస్ వరల్డ్ బ్యూటీస్ కాలేశ్వరం మీద నోటీసులు %-% ఇదే రేవంత్ రాజకీయమని విమర్శించారు. మిస్ వరల్డ్ బ్యూటీస్‌కి కూడా రేవంత్ రెడ్డి చూపిస్తున్నది %-% అంతా మా ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులు మాత్రమేనన్నారు. నిజాం కట్టిన చార్మినార్ లేదా కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు తప్ప, కాంగ్రెస్ పార్టీ కట్టిన ఒక్కదానినైనా రేవంత్ రెడ్డి చూపించగలడా అని ప్రశ్నించారు. కాలేశ్వరంలోని రెండు పిల్లర్లకు ఇంత రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ఏం చేసిందని ప్రశ్నించారు. మూడు నెలల తర్వాత కూడా అందులో చిక్కుకున్న వారిని బయటకు తీయలేకపోయారన్నారు. కమిషన్ల కోసం ఎస్ఎల్బీసీ హడావిడిగా మొదలుపెట్టారని.. రేవంత్ రెడ్డి భాషలో చెప్పాలంటే, మగోడు అయితే ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసేవాడన్నారు.రేవంత్ రెడ్డిలో అపరిచితుడు ఉన్నాడు %-% ఒకరోజు కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అంటాడు. రేవంత్ రెడ్డికి భయంకరమైన మానసిక వ్యాధి ఉంది. 'మల్టిపుల్ పర్సనాలిటీ డిసార్డర్' అనే మానసిక రుగ్మతతో ఉన్నాడన్నారు. అందుకే ఒకే అంశంపై ఆయన రోజుకోలా మాట్లాడతారని.. మరో రోజు కాళేశ్వరంలోని మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తామంటారన్నారు. వాళ్ల ప్రభుత్వంలోని మంత్రులు రంగనాయక సాగర్ నుంచి నీళ్లకు జెండాలు ఊపుతారు. ఒక రోజు అప్పు లేదు అంటారు మరొక రోజు అసెంబ్లీలో రూ. 1,70,000 కోట్ల అప్పు చేశామని అంటారు. ఒక రోజు కాకతీయ కళాతోరణం అధికార చిహ్నంగా వద్దంటారు మరొక రోజు పొట్టి దారులకు దాన్ని చూపిస్తారు.ఒక రోజు కేసీఆర్ ఆనవాళ్లు తొలగిస్తామని అంటారు మరొక రోజు కేసీఆర్ కట్టిన ప్రతిదీ తిరిగి చూపిస్తారని విమర్శించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మళ్ళీ ఎన్‌కౌంటర్

జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు కూడా మృతి చెందాడు. అలాగే, బాపట్ల జిల్లాకు చెందినట్లుగా భావిస్తున్న మరో కీలక నేత సజ్జ నాగేశ్వరరావు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అయితే, మృతదేహాలను గుర్తించి, పోస్టుమార్టం నిర్వహించిన తర్వాతే ఈ విషయంపై అధికారిక స్పష్టత రానుంది. ఈ ఘటనలో గాయపడిన రమేష్ అనే జవాను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో, మొత్తం ఇద్దరు జవాన్లు మరణం పొందినట్లయింది.

### కొనసాగుతున్న కూంబింగ్, మృతదేహాల గుర్తింపు

అబూజ్‌మాడ్ ఘటన స్థలంలో భద్రతా బలగాలు ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. గాయపడి తప్పించుకున్న మావోయిస్టుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడం, భారీ వర్షం కురుస్తుండటంతో మృతదేహాలను తరలించే ప్రక్రియ ఆలస్యమవుతోందని పోలీసు వర్గాలు తెలిపాయి. కొన్ని మృతదేహాలను మాత్రమే నారాయణ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత, వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

### వ్యూహాత్మక దాడి, కేంద్రం ప్రశంసలు

కర్రె గుట్టలో సుమారు 24 రోజుల క్రితం జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించినప్పటికీ, అగ్రనేతలు తప్పించుకున్నారు. దీంతో, అబూజ్‌మాడ్‌ను సురక్షిత ప్రాంతంగా భావించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నంబాల కేశవరావు నేతృత్వంలో కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో స్థాయి నేతలు సమావేశమైనట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. ఈ పక్కా సమాచారంతోనే భద్రతా బలగాలు మూడు రోజులుగా వ్యూహాత్మకంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దాడి చేశాయి.
మావోయిస్టులకు మూడు నుంచి నాలుగు అంచెల భద్రత ఉన్నప్పటికీ, బలగాలు వారిని ఛేదించి భారీ విజయం సాధించాయని తెలుస్తోంది. ఈ ఆపరేషన్ విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, హోంమంత్రి భద్రతా బలగాలను అభినందించారు. అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# రైతు ఆత్మహత్యాయత్నం

**తుంగతుర్తి** కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెల దాటుతున్నా, కాంటా వేయకపోవడంతో విసుగెత్తిన ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి రైతులు గమనించి పెట్రోల్ బాటిల్ లాక్కోవడంతో ప్రమాదం తప్పింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల వెంకన్న ఐకేపీ కేంద్రంలో ధాన్యం పోశాడు. 30 రోజులు దాటుతున్నా ఐకేపీ సెంటర్ నిర్వాహకులు ధాన్యం కాంటా వేయలేదు.వానలు పడినప్పుడల్లా తిరిగి ఆరబెట్టాల్సి వస్తున్నది.దీంతో రైతు వెంకన్న ధాన్యం రాశి వద్దే పెట్రోల్ మీద పోసుకొని అంటించుకునే ప్రయత్నం చేశాడు. పక్కనున్న రైతులు గమనించి పెట్రోల్ బాటిల్ లాక్కొని నచ్చజెప్పడంతో ప్రమాదం తప్పింది.

## ఏ విచారణకైనా సిద్ధమని
# జగన్ ఎందుకు చెప్పడం లేదు

అంటున్నారని షర్మిల గుర్తుచేశారు. "మీరు నిజంగా నిర్దోషి అయితే, మీ తండ్రి రాజశేఖరరెడ్డి గారిలా 'నా తప్పుంటే నన్ను ఉరితీయండి' అని ఎందుకు చెప్పలేకపోతున్నారు? ఏ విచారణకైనా సిద్ధమని, సీబీఐతోనా లేక సిట్టింగ్ జడ్జితోనా దర్యాప్తు చేయించుకోమని మీరు ఎందుకు ధైర్యంగా చెప్పడం లేదు?" అని షర్మిల నిలదీశారు. అసెంబ్లీ వేదికగా రికార్డుల్లో ఈ విషయాన్ని చెప్పాలని, అలా చెప్పలేకపోవడమే ఆయన తప్పుచేశారనడానికి నిదర్శనమని ప్రజలు భావిస్తున్నారని ఆమె అన్నారు.పోలీసుల గురించి జగన్ చేసిన వ్యాఖ్యలను కూడా షర్మిల తీవ్రంగా ఖండించారు. "గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, పోలీసుల బట్టలు ఊడదీస్తాం, తరిమి తరిమి కొడతాం, విదేశాలకు వెళ్లినా వదిలిపెట్టం వంటి మాటలు మాట్లాడటం తగదు" అని షర్మిల పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో పోలీసు వ్యవస్థను జగన్ ఎలా వాడుకున్నారో, ముఖ్యంగా రఘురామ వంటి వారి విషయంలో ఎలా ప్రవర్తించారో ప్రజలు మర్చిపోలేదని ఆమె వ్యాఖ్యానించారు. అలాంటిది ఇప్పుడు పోలీసుల గురించి తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. అసెంబ్లీ సమావేశాలకు జగన్ ఎందుకు హాజరు కావడం లేదని షర్మిల ప్రశ్నించారు. కనీసం మీడియా సమావేశంలోనైనా, మద్యం అమ్మకాలను కేవలం నగదు రూపంలోనే ఎందుకు చేశారనే దానికి ప్రజలు సమాధానం ఆశిస్తున్నారని, ఆ విషయం చెప్పకుండా దాటవేస్తున్నారని విమర్శించారు. తన చుట్టూ ఉన్నవారంతా మంచివారని, మచ్చలేని వారని చెప్పడం, సీబీఐ చేత దోషిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాశ్ రెడ్డి వంటి వారిని 'అమూల్ బేబీ', 'చిన్నవాడు', 'ఏమీ తెలియదు' అంటూ పక్కన పెట్టుకుని తిరగడాన్ని షర్మిల తప్పుబట్టారు. "అలాంటి వారికి మీరు ఇచ్చే సర్టిఫికెట్లు ఎవరికి కావాలి? నిజంగా నిర్దోషి అయితే, వ్యవస్థలో నిరూపించుకోవడానికి మార్గాలున్నాయి, కానీ మీరు ఆ పని చేయడం లేదు" అని షర్మిల అన్నారు. ఈ వైఖరే జగన్ దోషి అనే భావనను ప్రజల్లో కలిగిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

# ఇక్కడ మోదీ ఉన్నారనే సంగతి మరిచిపోద్దు

చెందిన సుమారు 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయని ఆయన పేర్కొన్నారు. "నా నరాల్లో రక్తం కాదు, సిందూరం మరుగుతోంది" అని మోదీ ఉద్ఘాటించారు. "ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ ఐక్యంగా ఉంది. పహల్గామ్ దాడి తూటాలు 140 కోట్ల మంది భారతీయుల గుండెల్లో గుచ్చుకున్నాయి. మేం ఉగ్రవాదపు గుండెల్లోనే దెబ్బకొట్టాం. ప్రభుత్వం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. మన సాయుధ దళాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయి" అని ప్రధాని వివరించారు. ఈ కార్యక్రమానికి ముందు, ప్రధాని మోదీ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేసిన దేష్నోక్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే, బికనీర్-ముంబై ఎక్స్‌ప్రెస్ రైలుకు పచ్చజెండా ఊపారు. అనంతరం దేష్నోక్‌లోని ప్రసిద్ధ కర్ణిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

# జీవన్ రెడ్డి దెబ్బకు కాంగ్రెస్ రెండు ముక్కలు కానుందా.?

ఆగ్రహం చూసిన కాంగ్రెస్ నేతలకు పార్టీలో ఏం జరుగుతుందో అర్థంకాని అయోమయం నెలకొంది. ఇక మీ రాజ్యం.. మీరే ఏలుకోండి.. అంటూ పొంగులేటి ముఖంమీదే అనేశారు జీవన్ రెడ్డి. రాకరాక కాంగ్రెస్ కు అధికారం చేతికొస్తే ,అదేపార్టీలో ఉన్న సీనియర్ నేత జీవన్ రెడ్డి అలా అనేశారేంటి, ఆయన అంతలా రగిలిపోవడం వెనుక ఏం జరుగుతోంది అనే ఆసక్తి తెలంగాణ రాజకీయాల హీటెక్కిస్తోంది.

### జీవన్ రెడ్డి ఆగ్రహానికి కారణాలు ఇవే..

తెంగాణ కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డి వీహెచ్ తరువాత అంతటి సీనియర్ నేత, ఆరు సార్లు ఎమ్మెల్యేగా , ఓసారి ఎమ్మెల్సీగా గెలుపొందిన జీవన్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల మద్దతు దండిగా ఉన్నా, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు జీవన్ రెడ్డికి మంటెక్కిస్తున్నాయి. గత ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా పోటీ చేసి గెలిచిన బిఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బ్రిఆర్ఎస్ వీడి హైదర్శాబాద్‌లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ రోజు మొదలు జీవన్ రెడ్డికి కంటిమీద కునుకులేదంటే అతిశయోక్తికాదు. నా ప్రత్యర్ధినే , నా అనుమతి లేకుండా కాంగ్రెస్‌లోకి ఎలా చేర్చుకుంటారు. పార్టీ కోసం సర్వం త్యాగం చేసిన తనను కాదని, సంజయ్‌ను అందలం ఎక్కిస్తారా అంటూ జీవన్ రెడ్డి రగిలిపోతున్నారు. అనేక సందర్భాల్లో తన అసంతృప్తిని బహిరంగంగానే బయటపెట్టారు. రేవంత్ నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వంలో సీనియర్లను పట్టించుకోవడంలేదంటూ రగిలిపోతున్నారు. ఇలా జగిత్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేయకుండానే భగ్గుమంటోంది. ఆ సెగలు జగిత్యాలను రాజకీయలను మాత్రమేకాదు, ఏకంగా తెలంగాణ అంతటా వ్యాపిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి సైతం జోక్యం చేసుకోవడానికి సాహసం చేయలేనంతలా వివాదం ముదిరిపోయింది.

### జీవన్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ సీనియర్లు..

జీవన్ రెడ్డి ఆవేదన రెవంత్ రెడ్డి కోటరీకి పట్టడంలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో రేవంత్ తీరుపై అసంతృప్తిగా ఉన్న కొందరు మంత్రులు, సీనియర్లు జీవన్ రెడ్డికి మద్దతుగా ఏకమవుతున్నారట. ఇటీవల జీవన్ రెడ్డిని కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ చేసి వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు, పార్టీ కోసం ఎంతో చేశారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని వదులుకోదంటూ మద్దతుగా నిలబడ్డారు. ఇలా రేవంత్ వర్గం మంత్రులు జీవన్ రెడ్డికి అంటి ముట్టనట్లు ఉంటే, సీనియర్లు మాత్రం మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారట. ఇలాంటి టైంలో తాను స్పందిస్తే రెండు వర్గాలుగా మారి పరిస్థితి మరింత చేయిదాటుందని భావించిన రేవంత్ రెడ్డి వ్యూహాత్మక మౌనం వహిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మొత్తానికి బిఆర్ఎస్ నుంచి వస్తున్నారుగా రారమ్మంటూ సంజయ్ ను కాంగ్రెస్ లోకి ఆహ్వానించి, ప్రతిపక్షానికి షాకిచ్చామనే ఆనందం ఓవైపు, తీరా పార్టీలోకి వచ్చాక జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలు , జీవన్ రెడ్డితోపాటు సీనియర్ల నుంచి వస్తున్న విమర్శలు రేవంత్ కి తలనొప్పిగా మారాయట.

# జూన్ 4న వెన్నుపోటు దినం

మండిపడ్డారు. చంద్రబాబు పాలనలోకి వచ్చిన తర్వాత ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా పడిపోయిందన్నారు జగన్. రాష్ట్ర ఆదాయం కూడా భారీగా పడిపోయిందని గుర్తు చేశారు. అప్పులు చేసి ప్రజలకు మేలు చేసి, రాష్ట్ర ఆదాయం పెంచాల్సిన వ్యక్తి తన జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. కరోనా హయాంలో కూడా సంక్షేమానికి లోటు లేకుండా చూశామని ఆదాయం పడిపోకుండా చేశామన్నారు. తమ ఐదేళ్ల పాలనలో 3,32,671 లక్షల కోట్లు అప్పు చేస్తే ఏడాదిలోనే చంద్రబాబు 1,37,546 లక్షల కోట్లు అప్పులు చేశారని గుర్తు చేశారు.

### జూన్ 4న వెన్నుపోటు దినం' ప్రజలంతా పాల్గొనాలని జగన్ పిలుపు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న వేళ ఆందోళన చేపట్టేందుకు వైసీపీ సిద్ధమైంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4న వెన్నుపాటు దినంగా జరుపుతున్నట్టు జగన్ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ప్రోగ్రెస్ రిపోర్ట్ చెప్పిన ఆయన... కుంభకోణాలతో ప్రజల ధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. అందుకే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు జూన్4న వెన్నుపాటు దినంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆ రోజు జిల్లా, మండలంలోని అధికారులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

### పార్టీ నడపడానికి ఇబ్బంది పడుతున్నాను: జగన్

మీడియా సమావేశంలో జగన్ చేసిన ఓ కామెంట్ ఆసక్తిగా మారింది. లిక్కర్ స్కామ్ కేసులో డబ్బులు చేతులు మారుతూ చివరికి జగన్ వద్దకే చేరానే ఆరోపణలు విపిస్తున్నాయని జాతీయ మీడియా ప్రశ్నించింది. దీనికి సమాధానంగా జగన్ మాట్లాడుతూ ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయో తనకు చెప్పాలని అన్నారు. డబ్బుల్లేక పార్టీ నడపడానికి ఇబ్బంది పడుతున్నాని చెప్పుకొచ్చారు. అందుకే ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయో చెప్పడని మీడియాకు రిక్వస్ట్ చేశారు.

### మోదీ, అమిత్‌షాను కూడా అరెస్టు చేసేయొచ్చు: జగన్

లిక్కర్ స్కామ్‌పై మాట్లాడుతూ రేపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమిత్‌షా, మోదీపై కూడా కేసులు పెట్టొచ్చని అన్నారు. ఎవరో ఒకర్ని లొంగదీసుకొని స్టేట్మెంట్ కేసులు పెట్టి అరెస్టు చేసేయొచ్చని చెప్పుకొచ్చారు. లిక్కర్ స్కామ్‌పై మాట్లాడుతూ రేపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమిత్‌షా, మోదీపై కూడా కేసులు పెట్టొచ్చని అన్నారు. ఎవరో ఒకర్ని లొంగదీసుకొని స్టేట్మెంట్ కేసులు పెట్టి అరెస్టు చేసేయొచ్చని చెప్పుకొచ్చారు. అసలు అలాంటి స్టేట్మెంట్‌లు ఇచ్చే వాళ్ల క్రెడిబిలిటీ ఏంటని ప్రశ్నించారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కేసీ రెడ్డి టీడీపీ ఎంపీ కేశినేని చిన్నితో వ్యాపారాలు చేస్తున్నారని వివరించారు. ఆ వ్యక్తి తప్పుడు స్టేట్మెంట్ ఇచ్చేందుకు అంగీకరించలేదని నిందితుడిగా చేర్చి ఇప్పండి పెడుతున్నారని అన్నారు. తప్పుడు స్టేట్మెంట్ ఇచ్చేందుకు అంగీకరించినందునే వాసుదేవరెడ్డి బయట ఉన్నారని చెప్పుకొచ్చారు.ఇలా కేసులు బుక్ చేసుకుంటూ వెళ్లే ఎవరిపైనైనా కేసులు పెట్టి లోపల వేసేయొచ్చని అన్నారు. కానీ ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపించలేకపోతున్నారని అన్నారు. సీఎంవో సంతకాలు చేసినట్టు ఒక్కటైనా ఆధారం ఉందా అని ప్రశ్నించారు. ఇప్పుడు అరెస్టు చేసిన వారు నేరుగా కేసులో ఉన్నట్టు ఒక్క ఆధారమైనా ఉందా అని నిలదీశారు. వైసీపీ పోరాటాల నుంచి పుట్టిందని ఇలాంటి తప్పుడు కేసులు, జైల్లు కొత్తకాదని అభిప్రాయపడ్డారు.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి

కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 106 కేసుల్లో ఇవి అత్యధికం కావడం గమనార్హం. ప్రస్తుతం 16 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, వీరిలో చాలామందిని వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేఈఎం ఆసుపత్రి నుంచి సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఇన్ ఫ్లుయెంజా లేదా తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ లక్షణాలున్న వారందరికీ కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
మరోవైపు, పుణె నగరంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాక్టివ్ కేసులు లేనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా నాయుడు ఆసుపత్రిలో 50 పడకలను సిద్ధం చేశారు. మే నెలలో మంజరీ ప్రాంతానికి చెందిన 87 ఏళ్ల వృద్ధురాలు మాత్రమే కోవిడ్ బారిన పడి, పూర్తిగా కోలుకున్నారని పుణె మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగం చీఫ్ డాక్టర్ నీనా బోరాడే తెలిపారు. నగరంలోని సివిక్ ఆసుపత్రుల్లో ప్రస్తుతం పరీక్షలు నిర్వహించడం లేదని, కేంద్రం నుంచి కొత్త మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నామని ఆమె పేర్కొన్నారు.తమిళనాడులోనూ కరోనా కేసులు పెరుగుతున్నాయి. పుదుచ్చేరిలో 12 కొత్త కేసులు వెలుగుచూశాయి. చెన్నై నగరంలో గతంలో ఇన్ ఫ్లుయెంజాగా భావించిన జ్వరాలు ఇప్పుడు ఎక్కువగా కోవిడ్-19గా నిర్ధారణ అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ ముప్పు కారణంగా అవయవ మార్పిడులు, గుండె శస్త్రచికిత్సలు వంటి కీలకమైన ఆపరేషన్లను కూడా వాయిదా వేస్తున్నారు.కర్ణాటకలో 16 యాక్టివ్ కోవిడ్ కేసులు ఉన్నాయని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు ధృవీకరించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో ఒక్కరోజే ఏకంగా ఏడు కొత్త కేసులు బయటపడ్డాయి. గత ఏడాది కాలంగా నెలకు సగటున ఒక కేసు మాత్రమే నమోదైన ఈ నగరంలో ఇది అసాధారణ పెరుగుదలగా అధికారులు గుర్తించారు. బాధితులందరూ హోం ఐసోలేషన్‌లో ఉన్నారని, వారి నమూనాలను జన్యు పరీక్షల కోసం పంపించామని తెలిపారు.

# మై డియర్ డాడీ అంటూనే దాడి

వరంగల్‌లో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహణ తీరుపై తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు కనిపిస్తోంది.సభలో కేసీఆర్ ప్రసంగానికి ముందు, పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడి ఉండాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలిచిన నాయకులు, ధూంధాం కార్యకర్తలు ప్రసంగించి ఉంటే అది శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి ఉండేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సభ ద్వారా కార్యకర్తలను పూర్తిగా ఆకట్టుకోవడంలో పార్టీ విఫలమైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులైన బీజేపీపై మరింత బలంగా విమర్శలు గుప్పించాల్సిందని కవిత ఈ లేఖలో అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కేసీఆర్ బీజేపీతో పొత్తు పెట్టుకుంటారని చాలా మంది ప్రచారం చేస్తున్నారని, ఇది పార్టీకి నష్టం కలిగిస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా తాను కూడా బీజేపీ వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నానని, అందుకే బీజేపీని మరింత తీవ్రంగా లక్ష్యంగా చేసుకోవాలని ఆమె తన తండ్రికి సూచించినట్లు లేఖలో ఉంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా బీజేపీకి మద్దతు ఇచ్చిందనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందని, ఇది పార్టీకి ప్రతికూలంగా మారిందని కవిత పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, పార్టీకి నిర్దిష్టమైన కార్యక్రమాలు, మార్గదర్శకాలు అవసరమని అంతా భావించారని, కానీ వరంగల్ సభలో అలాంటి స్పష్టత కొరవడిందని లేఖలో ప్రస్తావించారు. ఇప్పటికైనా ఒకటి లేదా రెండు ప్లీనరీ సమావేశాలను నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాలని కవిత సూచించినట్లు ఈ లేఖలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ పునర్నిర్మాణ దశలో ఉన్నందున, ఇలాంటి అంతర్గత విశ్లేషణలు, వ్యూహాత్మక మార్పులు అత్యవసరమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లేఖలోని అంశాలు, అది నిజమైనా కాకపోయినా, బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న అంతర్గత చర్చలను, భవిష్యత్ కార్యాచరణపై ఉన్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఈ అంశాలపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ఈ నెల 2న రాసిన ఈ లేఖ ఇప్పుడు సోషల్ మీడియాలో ఎలా బయటకు వచ్చిందో ఇంకా తెలియాల్సి ఉంది. కేసీఆర్‌కు తన కుమార్తె కవిత అంటే చాలా ఇష్టం. గతంలో నిజామాబాద్ నుంచి ఆమె ఎంపీగా గెలిచారు. గత ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేసి ఓడినప్పటికీ ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. పార్టీ బలోపేతం కోసం కేసీఆర్‌తో వ్యక్తిగతంగా మాట్లాడాల్సిన విషయాలను కవిత లేఖ రూపంలో రాయాల్సిన అవసరం ఏముందనే ప్రశ్న సైతం తలెత్తుతోంది. ఇది భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి.

# ఇంట్లోనే స్కానింగ్..

## – అబార్షన్ వికటించి వివాహిత మృతి



**నల్లగొండ** నకిరేకల్ లో ఇంట్లోనే స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేసుకొని స్కానింగ్ తీస్తూ లింగ నిర్ధారణ చేస్తున్న వైనం మరోసారి బయటపడింది. నిందితుడు యాదగిరిపై గతంలో పలు కేసులు నమోదు అయ్యాయి. రెండు రోజుల క్రితం సూర్యాపేట జిల్లా మోతే గ్రామానికి చెందిన అనూష అనే మహిళకు స్కానింగ్ తీసి లింగ నిర్ధారణ చేసాడు యాదగిరి . టేకుమట్ల గ్రామానికి చెందిన ఓ ఆర్ ఎం పి అనూషను యాదగిరి ఇంటికి స్కానింగ్ కోసం తీసుకొచ్చినట్లుగా సమాచారం. అనూష కు ఇప్పటికి ఇద్దరు ఆడపిల్లలు మరోసారి ఆడపిల్ల అని నిర్ధారణ చేయడంతో అబార్షన్ కి అనూష కుటుంబ సభ్యులు సిద్ధపడ్డారు. సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనూషకు అబార్షన్ చేయడంతో తీవ్ర రక్తస్రావం తో మృతి చెందింది. అనూష మృతి చెందిన వార్త తెలుసుకున్న స్కానింగ్ చేసిన యాదగిరి పరారీ అయ్యాడు.

# అనకాపల్లిలో టీడీపీ మినీ మహానాడు

**అనకాపల్లి** పాయకరావుపేట నియోజకవర్గం,యస్ రాయవరం మండలం అడ్డురోడ్డులో అనకాపల్లి జిల్లా మినీ మహానాడు జరిగింది. హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించారు. మినీ మహానాడులో అనకాపల్లి జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లురవీంద్ర,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. మంత్రులు వంగలపూడి అనిత,కొల్లు రవీంద్ర,టిడిపి నాయకులు.జ్యోతి ప్రజ్వలన చేసి,తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించారు. మినీ మహానాడులో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా అమోదించారు.

## తాడ్ బంద్ హనుమాన్ ఆలయంలో
# హనుమాన్ జయంతి

**సికింద్రాబాద్** తాడు బంద్ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుండి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఉదయం నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.హనుమాన్ జయంతి నేపథ్యంలో భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటున్నారు. భక్తులకు ప్రత్యేకంగా తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్ష చేసిన వాళ్ళు దీక్ష విరమణ ను చేశారు.

## సంపాదకీయం

### సర్వోన్నత వ్యవస్థల మధ్య
# ఎందుకీ సంవాదం

మన దేశంలో పరిపాలన రాజ్యాంగం ప్రకారం జరుగుతుంది. ఈ దేశంలో నియంతృత్వానికి చోటు లేదు. ఏకచత్రాధిపత్యానికి అవకాశం లేదు. ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగాలని రాజ్యాంగంలో అనేక నిబంధనలు పొందుపరిచారు.సాధారణంగా రాజ్యాంగం ఇచ్చిన నిర్వచనం ప్రకారం రాష్ట్రపతి అంటే ఈ దేశానికి సర్వస్వం. ఒకరకంగా రాష్ట్రపతిని నిలువెత్తు రాజ్యాంగానికి ప్రతీకగా భావించాల్సి ఉంటుంది. మనదేశంలో వెలువడే ప్రతి ఉత్తర్వు పైన రాష్ట్రపతి సంతకం కచ్చితంగా ఉంటుంది. పరిపాలనలో నేరుగా జోక్యం చేసుకోకపోయినప్పటికీ.. మనదేశంలో సాగుతున్న పరిపాలన మొత్తం రాష్ట్రపతి కనుసన్నల్లోనే నడుస్తూ ఉంటుంది. మన దేశానికి సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తికి రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అలాగే సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి రాష్ట్రపతి తో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఇక మన దేశానికి సంబంధించి ప్రధాన న్యాయమూర్తిని డిసైడ్ చేసే రైట్.. దానికి సంబంధించిన అఫీషియల్ గెజిట్ డిక్లేట్ చేసే రైట్ ఇండియన్ ప్రెసిడెంట్ కు ఉంటుంది. అంతేకాదు ఎంతటి గొప్ప గొప్ప స్థానంలో ఉన్న వ్యక్తులైనైనా సరే.. వారు తప్పులు చేస్తే అభిశంసించి ఆస్థానం నుంచి బయటికి పంపించే అధికారం కూడా మన దేశ పార్లమెంటుకు ఉంటుంది. దానికి ఆమోదముద్ర వేసే హక్కు కూడా రాష్ట్రపతికి ఉంటుంది.. ఇలా చెప్పుకుంటూ పోతే మన రాజ్యాంగంలో ఎన్నో విశేషాలు.. ఎన్నో విశిష్టమైన నిబంధనలు కనిపిస్తూనే ఉంటాయి.మన దేశంలో వ్యవస్థలన్నీ అత్యంత కీలకంగా ఉంటాయి. అలాగని ఒక వ్యవస్థ గొప్పది.. ఇంకో వ్యవస్థ తక్కువని రాజ్యాంగం చెప్పలేదు. ఇక మన దేశానికి సంబంధించి ముఖ్యంగా మూడు కీలక వ్యవస్థలు ఉంటాయి. శాసన, న్యాయ, కార్య నిర్వహణ వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేస్తాయి. అయితే రాజ్యాంగం ప్రకారం న్యాయ వ్యవస్థకు ఒక అదనపు అధికారం ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం ఏ నిర్ణయమైనా సరే అమలు జరుగుతున్న తీరును పరిశీలించడం.. ఒకవేళ ప్రతికూల పరిస్థితులు ఎదురైతే నేరుగా రంగంలోకి దిగడం.. కీలకమైన నిర్ణయాలు తీసుకోవడం వంటి హక్కులు సర్వోన్నత న్యాయస్థానానికి ఉంటాయి. దేశం ఏదైనా కష్టకాలంలో ఉన్నప్పుడు కీలక నిర్ణయాలు తీసుకోవాలనుకుంటే రాష్ట్రపతి కార్యాలయం న్యాయవ్యవస్థను సంప్రదిస్తుంది. అవసరమైతే ఏవైనా సలహాలు తీసుకుంటుంది.ఇంతటి దృఢమైన రాజ్యాంగ ఉన్న మనదేశంలో.. నష్టపోగా కొత్త సమస్య ఏర్పడింది. అది కూడా రాజ్యాంగం ఆధారంగానే తలెత్తింది. అదేంటంటే రాష్ట్రపతి గవర్నర్లకు సంబంధించిన నిర్ణయాధికారాల విషయంలో ఒక బార్డర్, టైం పీరియడ్ విధించవచ్చా.. దానిని న్యాయ వ్యవస్థ శాశించగలదా అనేది చర్చకు దారితీస్తోంది. ఇక ఈ విషయం మీద దేశ సర్వోన్నత న్యాయస్థానం మూడు నెలల కాలంలో.. తన వద్దకు వచ్చిన ఒక దస్త్రాన్ని వెంటనే పూర్తిచేసి పంపాలని డెడ్ లైన్ విధించింది. ఒకవేళ అలా చేయని పక్షంలో ఆ బిల్లును ఓకే చేసినట్టుగానే భావించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.ఎప్పుడైతే ప్రధాన న్యాయస్థానం ఆ మాట చెప్పిందో.. రాష్ట్రపతి రంగంలోకి దిగారు. సుప్రీంకోర్టుకు ఈ విషయంలో ఏకంగా ఒక లెటర్ రాశారు. దీంతో దేశంలో అత్యంత బలవంతమైన రాజ్యాంగ వ్యవస్థల మధ్య ఇది సంకట పరిస్థితిని తీసుకొచ్చింది.. రాష్ట్ర పరిపాలనలో కీలకమైన గవర్నర్లు పంపించే బిల్లుల విషయంలో.. ఏదైనా ఒక నిర్ణయం తీసుకోవడానికి డెడ్ లైన్ విధిస్తూ సర్వోన్నత నేస్తానం ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. అంతేకాదు సర్వోన్నత న్యాయస్థానానికి ఏకంగా పద్నాలుగు ప్రశ్నలు సంధించారు. అంతేకాదు తన అధికార పరిధిని ప్రశ్నించి.. ఏకంగా కాల పరిమితి విధించే స్థాయి సర్వోన్నత న్యాయస్థానానికి ఉందా అని రాష్ట్రపతి ఒక ధర్మ సందేహాన్ని వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య ఏర్పడిన వివాదం సర్వోన్నత న్యాయస్థానం దాకా వెళ్ళింది.. అయితే గవర్నర్లు పంపించే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాజ్యాంగం లోని 201 అధికరణ ప్రకారం ప్రెసిడెంట్ కు డెడ్ లైన్ విధించింది. అయితే ఈ విషయంపై రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు ఏకంగా ప్రశ్నావళిని సందిస్తూ మే 13న ఒక లెటర్ రాశారు. కాదు అందులో 143 అధికరణ ప్రకారం గవర్నర్లు, రాష్ట్రపతికి డెడ్లైన్ విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా అని ఆమె ప్రశ్నించారు.

అధికరణ 201 కింద ఇండియన్ ప్రెసిడెంట్ డిసైడ్ చేసే నాన్ ఆబ్జెక్షన్స్ పై సర్వోన్నత న్యాయస్థానం డిఫరెంట్ వెర్ డిక్ట్స్ ఇచ్చిందని రాష్ట్రపతి గుర్తు చేశారు. దీనిపై లెఫ్ట్ పార్ట్ లతోపాటు, తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా విమర్శలు చేశారు.. సర్వోన్నత న్యాయస్థానాన్ని రాష్ట్రపతి ఎలా వివరణ కోడతారని వారు ప్రశ్నించారు..ఒక రకంగా చూస్తే పార్లమెంట్లో ఎలాంటి చట్టం చేయాలనే విషయంపై ఎవరూ జోక్యం చేసుకోలేరు. చేసిన చట్టానికి సంబంధించి ఓకే చెప్పే విషయంలో ప్రెసిడెంట్ రైట్స్ ను క్వశ్చన్ చేయలేరని ఇంటలెక్చువల్స్ అభిప్రాయపడుతున్నారు.. కొన్ని చట్టాలు రాజ్యాంగానికి సంబంధించి అనుకూలంగా ఉండకపోవచ్చు. ప్రజల ప్రయోజనాలకు ఇబ్బందికరంగా ఉండొచ్చు. అయితే ఇలాంటి చట్టాలను నిలుపు చేయాల్సిన అవసరం ఉంటుందని కొంతమంది అంటుంటే.. అయితే ఒక పకడ్బందీగా డెడ్లైన్ లేకుంటే ప్రజలకు ప్రయోజనాలు దూరమవుతాయని వాదించేవారు కూడా ఉన్నారు.. రాష్ట్రపతి రాసిన లేఖలో.. ఏకంగా ప్రశ్నల పరంపర ఉన్న నేపథ్యంలో.. సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

# శరీరానికి శక్తినివ్వడంలో బి విటమిన్లు కీలకం

## - వాటి ఉపయోగాలేంటో తెలుసా..?




శక్తివంతమైన ఆరోగ్యం కోసం మనం తీసుకునే ఆహారంలో అనేక పోషకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వీటిలో విటమిన్ బి గ్రూప్ విటమిన్లు చాలా కీలకం. తరచుగా వైద్యులు విటమిన్ బి1, విటమిన్ బి12 వంటివి సూచించినప్పుడు, ఈ నంబర్ల వెనుక ఉన్న అర్థం ఏమిటని చాలామందికి సందేహం వస్తుంటుంది. శక్తి, మానసిక ప్రశాంతత, జీవక్రియల కోసం బి విటమిన్లు తీసుకుంటున్నామని చాలామంది చెప్పడం మనం వింటూనే ఉంటాం. అసలు ఈ బి విటమిన్లు మన శరీరంలో ఏం చేస్తాయో వివరంగా తెలుసుకుందాం. బి విటమిన్లు అనేవి నీటిలో కరిగే ఎనిమిది రకాల పోషకాల సమూహం. ఇవి ఆహారాన్ని శక్తిగా మార్చడం నుంచి నాడీ వ్యవస్థ పనితీరు, ఎర్ర రక్త కణాల ఏర్పాటు వరకు శరీరంలో అనేక కీలకమైన పనులకు అవసరం. ఈ విటమిన్లన్నింటినీ కలిపి బి-కాంప్లెక్స్ అని అంటారు. బి1 నుంచి బి12 వరకు ఉండే ఈ విటమిన్లు సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైనవి. ఇప్పుడు ఒక్కో విటమిన్ గురించి, వాటి ఉపయోగాలు, ప్రయోజనాలు, అవి లభించే ఆహార పదార్థాల గురించి చూద్దాం.

### - విటమిన్ బి1 (థయామిన్)

థయామిన్ అని కూడా పిలిచే విటమిన్ బి1, మన నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి చాలా అవసరం. పిండిపదార్థాలను శక్తిగా మార్చడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ శక్తి నాడీ కణాలు సరిగ్గా పనిచేయడానికి, ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది. విటమిన్ బి1 లోపం వల్ల బెరిబెరి అనే వ్యాధి వస్తుంది. దీనివల్ల అలసట, కండరాల బలహీనత, తీవ్రమైన సందర్భాల్లో గుండె, నరాల సమస్యలు తలెత్తుతాయి. మన శరీరం థయామిన్‌ను స్వయంగా తయారు చేసుకోలేదు కాబట్టి, విటమిన్ బి1 ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యం. పంది మాంసం, చేపలు, పప్పుధాన్యాలు (బఠాణీలు, చిక్కుళ్ళు, సోయాబీన్స్, కాయధాన్యాలు), బియ్యం, విత్తనాలు, పోషకాలు జోడించిన అల్పాహార ధాన్యాలలో ఇది లభిస్తుంది.

### - విటమిన్ బి2 (రైబోఫ్లేవిన్)

రైబోఫ్లేవిన్ అని కూడా పిలిచే విటమిన్ బి2, శక్తి ఉత్పత్తికి, కణాల పెరుగుదలకు చాలా ముఖ్యం. కొవ్వులు, ప్రోటీన్లు, పిండిపదార్థాలను విచ్ఛిన్నం చేయడంలో ఇది సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన చర్మం, కళ్ళు, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. దీని లోపం వల్ల పెదవులు పగలడం, గొంతు నొప్పి, చర్మ రుగ్మతలు రావచ్చు. గుడ్లు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, మాంసం, పుట్టగొడుగులు, బాదం వంటి వాటిలో రైబోఫ్లేవిన్ సహజంగా లభిస్తుంది.

### - విటమిన్ బి3 (నియాసిన్)

నియాసిన్‌ను నికోటినిక్ యాసిడ్, నియాసినామైడ్ అనే రెండు రూపాల్లో ఉంటుంది. ఈ పోషకం శక్తి జీవక్రియకు, డీఎన్ఏ మరమ్మత్తుకు, చర్మ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. నియాసిన్ హెచ్‌డిఎల్ (మంచి కొలెస్ట్రాల్)ను పెంచి, ఎల్‌డిఎల్ (చెడు కొలెస్ట్రాల్)ను తగ్గించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తుందని పేరు పొందింది. ఈ విటమిన్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మెదడు పనితీరుకు కూడా తోడ్పడుతుంది, ఆర్థరైటిస్ లక్షణాలను తగ్గించవచ్చు. సోయా, నట్స్, విత్తనాలు, పప్పుధాన్యాలు, ధాన్యాలు వంటి మొక్కల ఆధారిత, జంతు ఆధారిత ఆహార పదార్థాలలో విటమిన్ బి3 లభిస్తుంది.

### - విటమిన్ బి5 (పాంటోథెనిక్ యాసిడ్)

పాంటోథెనిక్ యాసిడ్ అని కూడా పిలువబడే విటమిన్ బి5, కొవ్వులు, పిండిపదార్థాలు, ప్రోటీన్ల జీవక్రియలో సహాయపడే కోఎంజైమ్ ఏ సంశ్లేషణకు అవసరం. ఈ పోషకం హార్మోన్ల ఉత్పత్తికి, ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు తోడ్పడుతుంది. దీని లోపం వల్ల అలసట, నరాల సంబంధిత సమస్యలు రావచ్చు. పాంటోథెనిక్ యాసిడ్ ఒత్తిడిని నిర్వహించడానికి శరీరానికి సహాయపడుతుంది. గాయాలు మానడాన్ని ప్రోత్సహిస్తుంది, పైపూత మందులలో ఉపయోగించినప్పుడు చర్మ తేమను మెరుగుపరుస్తుంది. దాదాపు అన్ని ఆహార పదార్థాలలో పాంటోథెనిక్ యాసిడ్ కొద్ది మొత్తంలో లభిస్తుంది. కానీ పోషకాలు జోడించిన ధాన్యాలు, శిశువుల ఫార్ములాలు, ఎండిన ఆహారాలు, పుట్టగొడుగులు, గుడ్లు, చేపలు, అవకాడోలు, చికెన్, బీఫ్, పంది మాంసం, పొద్దుతిరుగుడు విత్తనాలు, చిలగడదుంపలు, కాయధాన్యాలలో ఎక్కువ పరిమాణంలో ఉంటుంది.

### - విటమిన్ బి6 (పైరిడాక్సిన్)

పైరిడాక్సిన్ అని కూడా పిలిచే విటమిన్ బి6, అమైనో ఆమ్లాల జీవక్రియ, న్యూరోట్రాన్స్‌మిటర్ల (నాడీ సమాచార వాహకాలు) సంశ్లేషణతో సహా 100కు పైగా ఎంజైమ్ ప్రతిచర్యలకు బాధ్యత వహిస్తుంది. ఈ పోషకం మెదడు ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. విటమిన్ బి6 శరీరం ముఖ్యమైన న్యూరోట్రాన్స్‌మిటర్లను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. ఇవి మెదడు నుండి శరీరంలోని అన్ని కణాలకు సందేశాలను చేరవేసే రసాయన వాహకాలు. విటమిన్ బి6 లోపం వల్ల రక్తహీనత, డిప్రెషన్, బలహీనమైన రోగనిరోధక శక్తి ఏర్పడవచ్చు. విటమిన్ బి6 రుతుక్రమానికి ముందు వచ్చే లక్షణాలను (పీఎంఎస్), గర్భధారణ సమయంలో ఉదయం పూట వికారాన్ని తగ్గించవచ్చు. హెూమోసిస్టీన్ స్థాయిలను తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బీఫ్, పౌల్ట్రీ, పిండిపదార్థాలు అధికంగా ఉండే కూరగాయలు, సిట్రస్ కాని పండ్లు, పోషకాలు జోడించిన ధాన్యాలలో పైరిడాక్సిన్ లభిస్తుంది.

### - విటమిన్ బి7 (బయోటిన్)

బయోటిన్ అని కూడా పిలువబడే విటమిన్ బి7, ఆరోగ్యకరమైన జుట్టు, చర్మం, గోళ్ళను కోరుకునేవారికి మంచి స్నేహితుడు. ఇది జన్యు నియంత్రణలో, శక్తి జీవక్రియలో పాత్ర పోషిస్తుంది. దీని లోపం చాలా అరుదు, కానీ జుట్టు రాలడం, పెళుసైన గోళ్ళు, చర్మంపై దద్దుర్లు వంటివి సంభవించవచ్చు. జుట్టు, గోళ్ళ బలంపై దాని ప్రభావాల కోసం బయోటిన్ సప్లిమెంట్లు ప్రాచుర్యం పొందాయి, అయితే దీనికి సంబంధించిన ఆధారాలు మిశ్రమంగా ఉన్నాయి. ఇది గ్లూకోజ్ జీవక్రియకు తోడ్పడుతుంది, డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చవచ్చు. అవయవ మాంసాలు, గుడ్లు, చేపలు, విత్తనాలు, సోయాబీన్స్, నట్స్‌లో బయోటిన్ సహజంగా లభిస్తుంది.

### - విటమిన్ బి9 (ఫోలేట్)

ఫోలేట్ అని పిలువబడే విటమిన్ బి9, డీఎన్ఏ సంశ్లేషణ, కణ విభజన, గర్భధారణ సమయంలో న్యూరల్ ట్యూబ్ లోపాలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీని కృత్రిమ రూపమైన ఫోలిక్ యాసిడ్‌ను సప్లిమెంట్లలో, పోషకాలు జోడించిన ఆహారాలలో ఉపయోగిస్తారు. దీని లోపం వల్ల రక్తహీనత, పుట్టుకతో వచ్చే లోపాల ప్రమాదం పెరుగుతుంది. ఫోలేట్ పిండం అభివృద్ధికి పేరు పొందింది. ఇది వృద్ధులలో డిప్రెషన్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. ముదురు ఆకుపచ్చని ఆకుకూరలు, నట్స్, బీన్స్, పాల ఉత్పత్తులు, మాంసం, పౌల్ట్రీ, ధాన్యాలు, బ్రస్సెల్స్ మొలకలలో ఇది అత్యధిక స్థాయిలో సహజంగా లభిస్తుంది.

### - విటమిన్ బి12 (కోబాలమిన్)

విటమిన్ బి12 (కోబాలమిన్, సైనోకోబాలమిన్, మిథైల్ కోబాలమిన్) నాడీ వ్యవస్థ పనితీరుకు, డీఎన్ఏ ఉత్పత్తికి, ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు చాలా ముఖ్యం. బి12 విటమిన్ ఆరోగ్యానికి తోడ్పడుతుంది, న్యూరోడీజనరేటివ్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. శక్తి స్థాయిలను నిర్వహించడానికి, పెర్నిషియస్ అనీమియాను నివారించడానికి ఇది చాలా కీలకం. కోబాలమిన్ సహజంగా జంతు ఉత్పత్తులలో లభిస్తుంది. బి12 తక్కువగా ఉండటం వల్ల రక్తహీనత, నరాల సంబంధిత సమస్యలు, అలసట వంటివి వస్తాయి.

### - విటమిన్ బి కాంప్లెక్స్

విటమిన్ బి కాంప్లెక్స్ అనేది ఎనిమిది బి విటమిన్ల సమూహం: బి1 (థయామిన్), బి2 (రైబోఫ్లేవిన్), బి3 (నియాసిన్), బి5 (పాంటోథెనిక్ యాసిడ్), బి6 (పైరిడాక్సిన్), బి7 (బయోటిన్), బి9 (ఫోలిక్ యాసిడ్), బి12 (కోబాలమిన్). ఈ సప్లిమెంట్ శరీరంలో గుండె ఆరోగ్యం నుండి కణాల ఆరోగ్యం వరకు అనేక పనులకు బాధ్యత వహిస్తుంది. విటమిన్ బి కాంప్లెక్స్ కణాల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల పెరుగుదల, శక్తి స్థాయిలు, కంటి చూపు, మెదడు పనితీరు, జీర్ణక్రియ, ఆకలి, సరైన నాడీ వ్యవస్థ పనితీరు, హార్మోన్లు, కొలెస్ట్రాల్ ఉత్పత్తి, హృదయ ఆరోగ్యం, కండరాల బలానికి సహాయపడుతుంది.

### - ఏది మీకు సరిపోతుంది?

శరీరంలో బి విటమిన్లు కీలక పాత్ర పోషిస్తాయి. చాలా మంది ప్రజలు తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, పాల ఉత్పత్తులు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం ద్వారా బి విటమిన్ అవసరాలను తీర్చుకోవచ్చు. అయితే, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, శాకాహారులు, శోషణ సమస్యలు ఉన్నవారికి సప్లిమెంట్లు అవసరం కావచ్చు. అయినప్పటికీ, ఏదైనా కొత్త సప్లిమెంట్ తీసుకునే ముందు వైద్య నిపుణుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.

# అబ్బాయిలూ.. 'ప్రెట్టీ ఈజ్ నాట్ ఎవ్రీథింగ్'





మనసును తాకండి. అందమే అంతా కాదు. అబ్బాయిలూ.. 'ప్రెట్టీ ఈజ్ నాట్ ఎవ్రీథింగ్'. ఆశల్ని తుంచేయకండి. నవ్వుల్ని ఆర్పేయకండి. అమ్మాయిల్ని.. జబ్బున పడేయకండి. కొత్త కొరియన్ 'పాప్'! గర్ల్ బ్యాండ్ పాడుతోంది. ప్రపంచం ఇష్టంగా వింటోంది. "నీ కళ్ల ముందే కూలిపోతున్నా.. పాతాళంలోకి జారిపోతున్నా.. అయినా రెండు చేతులతో నా ఆశను పట్టుకుని పైకి ఎగబాకుతున్నా."పాడుతున్నారు 'బ్లాక్‌పింక్' గర్ల్స్. "నన్ను చూడు, నీకు ఏమనిపిస్తోంది?" అని.. కొనసాగింపుగా అడుగుతున్నారు జెన్నీ, జిసూ, లిసా, రోజ్. ఎవరిని అడుగుతున్నారు! ఆడపిల్లకు ఆశలు కల్పించి పారిపోయే మగధీరుడొకడు ఉంటాడు కదా, అతడిని.కొరియన్ గర్ల్ పాప్ బ్యాండ్ 'బ్లాక్‌పింక్' కొత్త ఆల్బమ్ 'ది అల్బమ్' లోని ఎనిమిది పాటల్లో ఒకటైన 'హౌ యు లైక్ దట్' లోని కూలిన ఆశల గీతమిది. అక్టోబర్ 2న ఈ నలుగురమ్మాయిల బ్యాండ్ విడుదల చేసిన 'ది ఆల్బమ్' అక్టోబర్ 26 నాటికి ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల 20 వేల కాపీలకు పైగా అమ్ముడై చరిత్ర సృష్టించింది. దక్షిణ కొరియా అంటే ఇంతవరకు ఆ ఏడుగురు అబ్బాయిల బి.టి.ఎస్. బాయ్ బ్యాండ్ మాత్రమే. వారే పాప్ హీరోలు, వారే పాప్ కింగులు. ఇప్పుడీ గర్ల్ బ్యాండ్ 'బ్లాక్‌పింక్' ధాటికి ఆ ఏడుగురు 2013 నుంచీ నిర్మించుకుంటూ వస్తున్న 'పాప్' లోక దుర్భేద్య మహా సామ్రాజ్యం బీటలు వారబోతున్న దృశ్యం లీలగా ఆవిష్కృతం కాబోతున్నట్లే ఉంది.

బ్లాక్‌పింక్ వరుసగా మూడో వారం 'బిల్‌బోర్డ్ 200' లిస్టులో తొలి పదిస్థానాలలో ఉంటూ వస్తోంది! ఆల్బమ్'లోని రెండో ట్రాక్ 'ది ఐస్ క్రీమ్'! 'దాహంగా ఉన్నట్లున్నావు.. కొంచెం దగ్గరకు రా..' అని కోన్‌ల లా మూతిని తెరిచి మూడు నిముషాల మూడు సెకన్లలో అబ్బాయిల్ని ఫ్రీజ్ చేసేసే బ్లాక్‌పింక్ గర్ల్స్.. మూడో ట్రాక్ 'ప్రెట్టీ శావేజ్'లో 'బాయ్స్.. మేం వైలెంట్‌గానే ఉంటాం. తట్టుకోగలిగితే ఉండండి' అని కొంచెం రూడ్‌గానే చెబుతారు. 'రూడ్ కాదు, అందరికన్నా రూడ్' అని ఇప్పటికే, ఈ నాలుగేళ్లలో ఈ నలుగురు పిల్లలకు పేరొచ్చేసింది! 2016లో ప్రారంభించారు బ్లాక్‌పింక్ పాప్ బ్యాండ్‌ని. ఈ ఎనిమిది ట్రాక్‌లకు ముందు ఐదు సింగిల్స్ ఉన్నాయి. అసలు వాటితోనే వాళ్లేమిటో చూపించారు.ఆ ఎనర్జీని తట్టుకోవాలంటే మళ్లీ వాళ్ల దగ్గరికే వెళ్లాలి 'ది ఐస్ క్రీమ్' కోసం! మొత్తం 174 సౌత్ కొరియన్ గర్ల్ గ్రూప్స్ ఉన్నాయి. వాటిల్లో పది లక్షల ఆల్బమ్ కాపీలు అమ్ముడై రికార్డు నెలకొల్పిన తొలి బ్యాండ్ 'బ్లాక్‌పింక్'! ఏమిటి బ్లాక్‌పింక్ అంటే?! ఈ అమ్మాయిలు కల్పించిన అర్థం.. 'అందమే అంతా కాదు' అని! అమ్మాయిల్ని అందమైన పింక్ గులాబీతో పోలుస్తాం. 'అందాన్నే చూడకండి' అంటూ పింక్‌కి బ్లాక్‌ని జోడించి బ్లాక్‌పింక్ అని తమ బ్యాండ్‌కి పేరు పెట్టుకున్నారు. బ్లాక్‌పింక్ అని కాకుండా, పింక్‌బ్లాక్ అంటే మళ్లీ అది బ్లాక్‌కి పింక్ అందాన్ని అంటు కట్టినట్లు. అందుకే బ్లాక్‌ని ముందుకు తీసుకున్నారు. తెలివైన అమ్మాయిలే.'లవ్‌సిక్ గర్ల్స్' ఐదో ట్రాక్. అమ్మాయిల్ని ప్రేమ సతాయింపులు ఎంత జబ్బున పడేస్తాయో చూడండి. 'ప్రేమ మనల్ని వలపన్ని కిటీకీలు లేని గదిలో బంధించింది. ప్రతిసారీ బాధిస్తోంది. గుండెలు పగిలి ఏడ్చేలా చేస్తోంది.

చివరికి ఏడుపు కూడా రానంతగా మొద్దుబారుతున్నాం.." అని పాడతారు. 'బెట్ యు వాన్నా', 'క్రేజీ ఓవర్ యు', 'లవ్ టు హేట్ మీ', 'యూ నెవర్ నో' మిగతా నాలుగు ట్రాక్స్. 'ఎక్కడికెళదామో చెప్పు, అన్నీ సర్దుకుని నేనే నీ దగ్గరకు వచ్చేస్తాను..' (బెట్ యు వాన్నా), 'నువ్వంటే నాకు పిచ్చి. నీ మనసులోనూ నేను ఉన్నానని తెలుసు. అయినా కానీ నువ్వు గీసుకున్న గీతను దాటి రానులే' (క్రేజీ ఓవర్ యు), 'నెగిటివ్ డేస్, నెగిటివ్ నైట్స్.బేబీ యు ఆర్ వేస్టింగ్ ఆల్ యువర్ టైమ్' (లవ్ టు హేట్ మీ), 'నేను ప్రకాశవంతంగా నవ్వుదామని ప్రయత్నించిన రోజు.. చీకటి మరింతగా గాఢమైన నన్ను మింగేయాలని చూస్తుంటుంది ఎందుకనో..' (యూ నెవర్ నో).. అని జెన్నీ, జిసూ, లిసా, రోజ్.. అమ్మాయిలు ఎంతగా ప్రేమిస్తారో, ఆ ప్రేమ వల్ల అంతగా హర్ట్ అవుతూ ఉంటారని 'ది అల్బమ్' ట్రాకులలో పాడతారు. 'ప్రెట్టీ ఈజ్ నాట్ ఎవ్రీథింగ్' అని చెబుతారు. అందుకే 'బ్లాక్‌పింక్' ఇంతగా హిట్ అయినట్లుంది

# పూడూరులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్) మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరు గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూడూరు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పురోహితులు కలగ గణపతి శర్మ, సంపత్ శర్మ, వెంకటేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గణపతి హెూమం, అభిషేకాలు, సిందూర లేపనం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో కందుకూరి సాయి కుమార్, గూడూరు శ్రీధర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమేష్ యాదవ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థులను స్థానికులుగానే పరిగణించాలి -కల్యాణి



దమ్మాయిగూడ (ప్రశ్నన్యూస్ )తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ పాఠశాలలు ఏర్పాటు అయ్యేవరకు ఆంధ్రా సైనిక్ పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులను స్థానికులుగానే పరిగణించాలని, అర్హత పరీక్ష రాసిన విద్యార్థులు వారి తల్లి దండ్రులు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసారు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో క్రాంతి కీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి. ఎస్. ఆర్ క్రాంతి, ప్రధాన కార్యదర్శి లావణ్య, సెక్రెటరీ కల్యాణి సమన్వయ కర్త జాకబ్ లు మాట్లాడుతూ %శ్రీ%ఇతర రాష్ట్రాల్లో రెండు, మూడు సైనిక్ పాఠశాలలు ఉంటే తెలంగాణాలో మాత్రం ఒకటి కూడా లేదు ఎందుకని ప్రశ్నించారు. ఏ.పి సైనిక్ పాఠశాలలో తెలంగాణ విద్యార్థులకు స్థానిక హెూదా కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ సంవత్సరం సైనిక్ స్కూల్స్ ప్రవేశాల కోసం 20వేల కు పైగా విద్యార్థులు అర్హత పరీక్షరాశారని, ప్రవేశ పరీక్ష సమయంలో ఎలాంటి నిబంధనలు పెట్టని కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సైనిక్ స్కూల్ సొసైటీ ఫలితాలు విడుదలయ్యే పదిరోజుల ముందు తెలంగాణ విద్యార్థులను నాన్ లోకల్ గా పరిగనిస్తామని ప్రకటించడం ఆవేదన కలిగించే అంశం అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నెలకొల్పిన పాఠశాలలో ఇక్కడి విద్యార్థుల పట్ల వివక్ష ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

ఏ. పి ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాస్రం నుండి ప్రాతినిధ్యంవహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకొన్నారు.

# హనుమాన్ భక్తులకు మినరల్ వాటర్, అరటిపండ్ల పంపిణీ

**- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**




వేములవాడ, (ప్రశ్న న్యూస్) హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దీక్ష తీసుకొని కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో మినరల్ వాటర్,అరటిపండ్లు పంపిణీ చేశారు. దాతల సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా భక్తులకు ఊరట కలిగిందని, సహకారం అందించిన ప్రతి దాతకు ట్రస్ట్ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని నిర్వాహకులు మధు మహేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫిక్, పాత సంతోష్, ప్రతాప నటరాజు, పొలాస రాజేందర్, పసుల శ్రీనివాస్, సగ్గు రాహుల్, వొడ్యాల వేణు, వనపర్తి కరుణాకర్, పిన్నింటి హనుమాండ్లు, జిల్లా రమేష్, రాజేశం, దెబ్బేటి రాజు, చేకుర్తి నవీన్, మాడిశెట్టి రమాదేవి గోపీ దంపతులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ న్యాయవాదుల పక్షపాతి...

## కొత్తగూడెం న్యాయవాదులతో ముఖాముఖి లో ఏనుగుల రాకేష్ రెడ్డి..




కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) బిఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సెల్ ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బిఆర్ఎస్ అభ్యర్థి గా పోటీ చేసిన అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి కొత్తగూడెం బార్ అసోసియేషన్ కు విచ్చేశారు. అనంతరం సంకుబాపన అనుదీప్ ఆధ్వర్యంలో జరిగిన న్యాయవాదులతో ముఖాముఖి కార్యక్రమంలో రాకేష్ రెడ్డి, లక్కినేని సత్యనారాయణ, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందని,ముఖ్యంగా న్యాయవాద వృత్తి లో ప్రతిష్ఠను నిలుపుకోవడానికి, వారి ఆరోగ్య భద్రతను, ఆర్థిక స్థిరతను దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని అన్నారు. ముఖ్యంగా, న్యాయవాదుల కోసం ప్రత్యేక హెల్త్ కార్డుల అమలు ద్వారా, వైద్య సేవలకు అందుబాటులో కల్పించడమే కాకుండా, కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు మేరుగైన భరోసా ఇచ్చిందని నాటి ముఖ్యమంత్రి కేసిఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఇది రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది న్యాయవాదులకు మరియు వారి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో, దేశం మొత్తం లాక్‌డౌన్ లో ఉండగా, న్యాయవాదులు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురైన సందర్భంలో, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం, నాటి ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రత్యేకంగా స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అందరు న్యాయవాదులకు రెండు పర్యాయాలు ఆర్థిక సహకారం అందించారని ఇది అప్పట్లో దేశంలో మరెక్కడా జరుగని విధంగా ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ చర్యలన్నీ న్యాయవాద వృత్తి పట్ల బిఆర్ఎస్ ప్రభుత్వ దృఢమైన పక్షపాతం, నిబద్ధత, గౌరవం అనే దానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. న్యాయవాదుల సంక్షేమాన్ని ప్రభుత్వ విధానాల్లో భాగం చేసుకొని, న్యాయవాదులకు వంద కోట్ల రూపాయలతో నిధితో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్టు ను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి తోడ్పడిన ఏకైక ప్రభుత్వం టబిఆర్ఎస్ ప్రభుత్వం అని ధైర్యంగా చెప్పవచ్చు అని అన్నారు. ఈ నేపధ్యంలో,న్యాయవాద సంఘాలు, న్యాయవాదులు, ఈ సేవలను గుర్తుంచుకొని, బిఆర్ఎస్ పార్టీ చేసిన సేవలకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని న్యాయవాదుల మద్దతు బిఆర్ఎస్ కు అందించాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జనపరెడ్డి గోపి కృష్ణ, బిఆర్ఎస్ లీగల్ సెల్ సినియర్ న్యాయవాదులు వై.బాబురావు, తోగరు రాజశేఖర్, యస్.విజయ భాస్కర్ రెడ్డి, బార్ అసోసియేషన్ సినియర్ న్యాయవాదులు ఆర్.విజయ్ కుమార్, వి.నాగిరెడ్డి, వి.కోటం రాజు, జే.పద్మనాభరావు, జీ.రాంమూర్తీ, అంబటి రమేష్, మహమ్మద్ సాదిక్ పాషా, యర్ర కామేష్, బండ్ల రాజశేఖర్, డి. రాజేందర్, బిఆర్ఎస్ లీగల్ సెల్ భాధ్యులు సంకుబాపన అనుదీప్, సామంత్, దేవేంద్ర వర ప్రసాద్, అంకుష్ పాష, మునికోటి రాకేష్, లావుద్య రమేష్, ధరవత్ రాధాకృష్ణ, సయ్యద్ ముజిబ్ ఉల్లా, మహేష్ ఆనంద్, మహిళా న్యాయవాదులు ఆడపాల మహాలక్ష్మి, కాకాటి నీలివేణి, జ్యోతి విశ్వకర్మ, అరుణ లత, బేబి షామిలి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

## మేయర్, కమిషనర్ తో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎమ్మెల్యే నాగరాజు





వరంగల్ (ప్రశ్న న్యూస్)వర్షాకాలం సమీపిస్తున్న సందర్భంగా కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్న ఎమ్మెల్యే నాగరాజు . గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56 వ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ నాలా పోచమ్మ గుడి ప్రాంతం గోపాల్ పూర్ చెరువు తో పాటు 55 వ డివిజన్ పరిధిలోని నక్షత్ర కాలనీ ప్రాంతాల్లో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి క్షేత్ర స్థాయిలో నాలా ల్లో చేపట్టనున్న పూడికతీత ప్రక్రియను పరిశీలించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నాగరాజు ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ పరిధిలోని నాలాలలో పూడిక తొలగింపు ప్రక్రియ చేపట్టి వేగవంతంగా పూర్తిచేయాలని జవహర్ నగర్ పోచమ్మ గుడి ప్రాంతంలో గల నాలాపై భాగం లో ఫుట్ ఓవర్ బ్రిడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అన్నారు.గోపాల్ పూర్ చెరువు ప్రాంతం లో పర్యటించిన క్రమం లో ఆ ప్రాంతం లో జంగిల్ క్లియరెన్స్ చేసి చెట్లు నాటాలన్నారు. హైడ్రా తరహాలో నగరం లో వాడ్రా రానుందని తదుపరి ఎఫ్ టి ఎల్ జోన్ లోని ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ తరపున డిసిల్టింగ్ చేపట్టి శానిటేషన్ వారిచే శుభ్రం చేయించడం జరుగుతుందని స్థానికుల కోరిక మేరకు అనంతరం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు 55 వ డివిజన్ నక్షత్ర కాలనీ లో పర్యటించే క్రమం లో స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ ల దృష్టికి తీసుకురాగా స్పందించిన ఇరువురు కాలనీ వాదులు ఐక్యం గా ఉండాలని వీరి కోరిక మేరకు ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తిస్తారని కార్పొరేషన్ నిధులతో డ్రైనేజీ ఏర్పాటు కు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయుడిలా అసాధ్యాన్ని సుసాధ్యం చేసే తెగువ అందరిలో రావాలి

**- త్రీటౌన్ సిఐ శివప్రసాద్**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) ఉన్నతమైన ఆలోచనా విధానం, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే తెగువ ఆంజనేయుడదని ఆ స్వామినీ నమ్ముకున్న వారికి ఎలాంటి భయం అవసరం లేదని త్రీటౌన్ సిఐ శివప్రసాద్ అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ఉదయం రైతు బజార్ వద్ద చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హనుమాన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాధారణ కార్యదక్షత, భయాన్ని, నిరాశ నిస్పృహలను దరిచేరనివ్వని ధీశక్తి ఆంజనేయుడి సొంతం అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆ శ్రీరామ భక్తుడి ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నానని అన్నారు.కమిటీ నిర్వాహకులు సిఐను శాలువాతో సన్మానించించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేఖ రాజు, నమ్మి జగదీశ్, సుంకు కనకరాజు, పెద్దిరెడ్డి గోపి, అత్తులూరి అరుణ్, తెలంగాణ సురేష్, సుదర్శన్, నారాయణ సింగ్, ఏమునూరి శివ కృష్ణ, శీలం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మీకు తగ్గ బైకేనా?

అందరికీ బండి అవసరమే! కానీ కొనేటప్పుడు కొన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. కమ్యూటర్ బైక్‌తో లాంగ్‌టూర్‌కి వెళ్లాలంటే కుదురుతుందా? ఆఫ్‌రోడ్డు కోసమే తయారైన వాటిని తారురోడ్డుపై చక్కర్లు కొట్టిస్తే లాభమేంటి? అందుకే.. టూవీలర్ కొనేముందే ఇవి గమనించాలి.

**ఏ రకం?:** కమ్యూటర్లు, క్రూజర్లు, స్పోర్ట్ బైక్‌లు, టూరర్‌లు, స్ట్రీట్ బైక్‌లంటూ విపణిలో రకరకాలైనవి అందుబాటులో ఉన్నాయి. బండి కొనేముందే వాటి పనితీరు ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. ఎవరికి ఏవి నప్పుతాయో సమాచారం సేకరించాలి.

**వాడుకునే సమయం:** కొందరు రోజులో ఎక్కువదూరం ప్రయాణిస్తారు. ఇంకొందరు వారానికోసారైనా బండి బయటికి తీయరు. ఇలాంటప్పుడు వాడే సమయానికి అనుగుణంగా ఎంపిక ఉండాలి. అత్యధిక దూరం ప్రయాణించేవారు ఎక్కువ మైలేజీ ఇచ్చే బండికి ఓటేయాలి. తక్కువ తిరిగేవారు మంచి ఫీచర్లు, సౌకర్యాలు చూడాలి. నిర్వహణ ఖర్చులూ లెక్కేయాలి.లి ఇంజిన్ ఏది?: 100సీసీ నుంచి 500సీసీ ద్విచక్రవాహనాలు అందుబాటులో ఉన్నాయి. మంచి పికప్ కావాలంటే ఎక్కువ సీసీవి ఎంచుకోవాలి. మైలేజీ ముఖ్యం అనుకుంటే తక్కువ వాటితో వెళ్లిపోవచ్చు.

**శరీరానికి తగ్గట్టు:** ఆరడుగుల ఆజానుబాహుడు వంద సీసీ కమ్యూటర్ బైక్ మీద కూర్చుంటే బాగుండదు. బక్కపల్చని కుర్రాడు భారీ టూవీలర్ నడిపితే నప్పదు. సౌకర్యవంతంగానూ ఉండవు. బండి కొనేటప్పుడు పర్సనాలిటీకి తగ్గవి ఎంచుకోవడం ముఖ్యం. **కొత్తదా, పాతదా?:** ద్విచక్రవాహనం కొనడం ఎవరికైనా మరపురాని విషయమే. కొత్తది కొనాలా? పాతది తీసుకోవాలా? అనేదే మొదటి సందేహం. బ్రాండ్ న్యూ అయితే రైడింగ్ సాఫీగా సాగిపోతుంది. చాలా ప్లస్‌పాయింట్లు ఉంటాయి. ధర కూడా ఎక్కువే. భరించగలిగే స్తోమత లేకపోతే మంచి కండిషన్‌లో ఉన్న పాతది ఎంపిక చేసుకోవాలి.లి సర్వీస్ సంగతి: కొన్ని బ్రాండ్లు స్టైలిష్‌గా ఉంటాయి. రైడింగ్ బాగుంటుంది. సర్వీసింగ్ సెంటర్లు తక్కువ. విడిభాగాలు మార్కెట్లో అంత తేలిగ్గా దొరకవు. వీటినీ పరిగణనలోకి తీసుకోవాలి.

# కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు.. భగ్గుమన్న బీఆర్ఎస్

**యాదగిరిగుట్ట లో బీర్ల ఐలయ్య దిష్టిబొమ్మ దహనం.**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేసిన వ్యాఖ్యల పై యాదగిరిగుట్ట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. బీర్ల ఐలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా యాదగిరిగుట్ట బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో బీర్ల ఐలయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. అభివృద్ధిని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచి ప్రతిపక్షాల పై స్థాయిని మరిచి మాట్లాడడం తగదని హెచ్చరించారు.

# కార్యకర్త కుటుంబానికి రూ. 1లక్ష 5వేల ఆర్థిక సాయం అందజేసిన గొంగిడి మహేందర్ రెడ్డి



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సదా ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ మరణించగా వారి కుటుంబానికి అండగా బీఆర్ఎస్ పార్టీ తరుపున ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి 1 లక్ష 5 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు స్వయంగా ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్ యాదగిరిగుట్ట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాపట్ల నరహరి ఆరె శ్రీధర్ గౌడ్, ముఖ్యర్ల శ్రీశైలం యాదవ్, ముఖ్యర్ల సతీష్ యాదవ్,ఆవుల సాయి యాదవ్, కొన్యాల నర్సింహారెడ్డి, పల్లె సంతోష్ గౌడ్, మిట్ట అనిల్ గౌడ్ ,యాకుబ్, సూదగాని శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

## మాతృమూర్తి ముఖ్య అతిథిగా "వైభవం" గా ప్రి-రిలీజ్ వేడుక!



తమకు జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసి ప్రయోజకుల్ని చేయడమే కాకుండా... కార్పొరేట్ ఉద్యోగాలను వదిలిపెట్టి, సినిమా రంగంలో తమ ఉనికిని చాటుకోవాలన్న తమ తపనను కూడా ప్రోత్సహించిన తమ మాతృమూర్తిని సాదరంగా సత్కరించుకున్నారు "దర్శకహీరో ద్వయం" సాత్విక్ - రుత్విక్!! విద్యాధికులైన ఈ సోదరుల్లో.. తమ్ముడు సాత్విక్ దర్శకుడిగా అన్నయ్య రుత్విక్ హీరోగా పరిచయమవుతూ... తల్లి రమాదేవి నిర్మాతగా రమాదేవి ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ "వైభవం" ఈ శుక్రవారం (మే 23) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, ప్రసాద్ ల్యాబ్ లో నిర్వహించిన "వైభవం" ప్రి - రిలీజ్ వేడుకలో... తమ మాతృమూర్తి రమాదేవిని సాదరంగా సత్కరించుకున్నారు హీరో రుత్విక్ - డైరెక్టర్ సాత్విక్. అంతేకాదు తమ మాతృమూర్తే ముఖ్య అతిథిగా వేడుకను నిర్వహించుకున్నారు!! "చిన్నప్పటి నుంచి... చదువులో, ఆటపాటల్లో అన్నిటా ముందుండి, మంచి ఉద్యోగాలు సంపాదించుకుని, తనకు ఎనలేని పుత్రోత్సాహం పంచి.. తమ ప్యాషన్ కోసం ఉద్యోగాలు విడిచిపెట్టి.. "వైభవం" చిత్రంతో సినిమా రంగ ప్రవేశం చేస్తున్న తన బిడ్డలు... ఈ రంగంలోనూ విజయబావుటా ఎగురవేస్తారనే నమ్మకం తనకుందని" అన్నారు స్వతహా లాయర్ అయిన రమాదేవి. "తమ మాతృమూర్తి తమ మీద పెట్టుకున్న నమ్మకం వమ్ము కాదని, "వైభవం" చిత్రం తమకు సినిమా రంగంలోనూ మంచి ఆరంభం ఇస్తుందని" హీరో రుత్విక్, దర్శకుడు సాత్విక్ పేర్కొన్నారు. ఇంటిల్లిపాదీ కలిసి చూసి ఆస్వాదించతగ్గ చిత్రంగా మలిచిన "వైభవం" ఈనెల 23, శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోందని, కుటుంబ విలువలతోపాటు... మానవతా విలువలు, భావోద్వేగాలు, సునిశిత హాస్యం కలగలిసిన ఈ చిత్రానికి అన్ని వర్గాల వారు పట్టం కడతారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ చిత్రంతో తెలుగులో ఎంట్రీ ఇస్తుండడం గర్వంగా ఉందని హీరోయిన్ ఇక్రా ఇద్రిసి అన్నారు. ఈ వేడుకలో ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన కె.ఎల్.ఎన్, అనంత్, కూడా పాల్గొని.. "వైభవం" చిత్రంలో నటించే అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు!

## శ్రీదేవిని తలచుకొని

### భావోద్వేగానికి గురైన జాన్వీ కపూర్..!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ తొలిసారిగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చలనచిత్ర ఉత్సవాల్లో ఒకటైన కేన్స్ ఫిలిం ఫెస్టివల్-2025లో తొలిసారి సందడి చేసింది. ఈ సందర్భంగా తన తల్లి శ్రీదేవిని తలచుకొని కన్నీరు పెట్టుకుంది. కేన్స్ తమ కుటుంబం, తల్లి శ్రీదేవికి ఎంతో ఇష్టమైన ప్రదేశమని, ఇక్కడ ఎన్నో మధుర జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయని యంగ్ బ్యూటీ పేర్కొంది. వోగ్ ఇండియా కోసం చేపట్టిన 'గెట్ రెడీ విత్ మీ' కార్యక్రమంలో జాన్వీకపూర్ పాల్గొంది. ఈ సందర్భంగా కేన్స్ సిటీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంది. తన తల్లికి ఇష్టమైన ప్రదేశమని.. హాలీడే కోసం వస్తుండేదని.. వరుసగా మూడునాలుగు సార్లు ఇక్కడే వేసవి సెలవులను గడిపామని జాన్వీ తెలిపింది.శ్రీదేవి కెరీర్‌లోని కీలమైన మైల్‌స్టోన్స్, అవార్డులను సైతం ఇక్కడే కుటుంబంతో సెలబ్రేట్ చేసుకున్నామని చెప్పింది. అవార్డు వచ్చినా.. 'ఇంగ్లీష్ వింగ్లీష్' లాంటి సినిమా ఏదైనా టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రీమియర్ అయినా.. కుటుంబమంతా కలిసి వేడుక చేసుకునేవాళ్లమని పేర్కొంది. ఆమె జీవితంలోని కీలకమైన ఘట్టాలను తాము ఇక్కడే సెలబ్రేట్ చేసుకున్నామని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యింది. కేన్స్‌కు ఈ సారి తండ్రి బోనీ కపూర్, సోదరి ఖుషీ కపూర్ లేకుండానే వచ్చానని.. శ్రీదేవి లేకుండా రావడం విచిత్రంగా.. బాధగా ఉందని తెలిపింది. జీవితంలోని ముఖ్యమైన సందర్భాలన్నింటికీ తనను తీసుకువెళ్లేదని.. ఇప్పుడు తన తల్లిని మిస్ అవుతున్నానని కన్నీటి పర్యంతమైంది.తన సినీ ప్రయాణాన్ని తీర్చిదిద్దడంలో తల్లి శ్రీదేవి కీలక పాత్ర పోషించిందని.. ఆమె లేకుండా కేన్స్‌లో ఉండడం ఏదో వెలితిగా అనిపిస్తుందని పేర్కొంది.

ఇదిలా ఉండగా.. గత వారం అట్టహాసంగా మొదలైన ఈ ఫెస్టివల్‌కి ప్రపంచంలో ఉన్న ఫేమస్ నటీనటులు అందరు హాజరై సందడి చేసే విషయం తెలిసిందే. హాలీవుడ్ నటీమణులు ఇప్పటికే కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కి హాజరై రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. అయితే తొలిసారి జాన్వీ కపూర్ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ రెడ్‌కార్పెట్‌పై అరంగేట్రం చేసి.. ప్రపంచాన్నంతా తనవైపునకు తిప్పుకుంది. ఈ నెల 20న రెడ్ కార్పెట్ అరంగేట్రం కోసం డిజైనర్ తరుణ్ తహిలియానీ రూపొందించిన రోజ్ కలర్ గౌను ధరించి సందడి చేసింది.



## థియేటర్‌లో ఫ్లాప్.. ఓటీటీలో మాత్రం అదరగొట్టేసిందిగా..!

యూత్ స్టార్ నితిన్ , గ్లామరస్ బ్యూటీ శ్రీలీల జంటగా నటించిన చిత్రం రాబిన్ హుడ్ కొద్ది రోజుల క్రితం థియేటర్స్‌లో విడుదలై డిజాస్టర్ టాక్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా నటించడంతో రిలీజ్ ముందు రోజు నుండే సినిమాపై బజ్ ఏర్పడింది. ఇక ఈ సినిమాకి ఛలో, భీష్మ సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్న వెంకీ కుడుమల దర్శకత్వం వహించడంతో మూవీ హిట్ అని అందరు అనుకున్నారు. ఇందులో క్రేజీ హీరోయిన్ కేతిక శర్మ ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించడం, అది కాస్తా వివాదాస్పదం కావడం..ఇలా రిలీజ్ కు ముందే రాబిన్ హుడ్ సినిమా వార్తలలో నిలిచింది.మార్చి 28న ఉగాది కానుకగా ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో విడుదల చేశారు. భీష్మ రేంజ్ లో ఈ చిత్రం విజయం అందుకోలేకపోయింది కానీ మోస్తరు ఎంటర్టైన్మెంట్ ని మాత్రం అందించింది. ఇటీవల ఈ చిత్రం ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసింది.ఈ చిత్రం ఓటిటి హక్కులు జీ5 సంస్థ కొనుగోలు చేయగా, మే 10 నుండి ప్రముఖ ఓటీటీ 'జీ5'లో సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. అదే రోజున 'జీ తెలుగు' ఛానల్‌లోనూ ప్రీమియర్ అయ్యింది. అయితే థియేటర్‌లో మూవీకి అంత రెస్పాన్స్ రాకపోయిన ఓటీటీలో మాత్రం అదరగొడుతుంది. ఓటీటీలో రిలీజ్ అయినప్పటి నుంచీ 'రాబిన్ హుడ్' మూవీ రికార్డులు క్రియేట్ చేస్తూనే ఉంది. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ యూత్ ఆడియన్స్‌కి దగ్గరైన ఈ



చిత్రం ఇప్పటివరకూ 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ సాధించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా సదరు ఓటీటీ సంస్థ వెల్లడించింది. ఇలాంటి రికార్డ్ సాధించడం పట్ల నితిన్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే. మూవీలో సీనియర్ యాక్టర్ రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, షైన్ టైమ్ చాకో, దేవదత్ నాగే, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు.

## సల్మాన్ నివాసంలో కలకలం..



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నివాసం గెలాక్సీ అపార్ట్‌మెంట్లలోకి అక్రమంగా ప్రవేశించేందుకు వరుసగా జరుగుతున్న ప్రయత్నాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మే 20న జితేంద్ర కుమార్ సింగ్ అనే యువకుడు చొరబడేందుకు ప్రయత్నించి అరెస్ట్ కాగా, ఆ మరుసటి రోజే (మే 21న) తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఇషా ఛబ్రా (36) అనే మహిళ కూడా అదే భవనంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించి లిఫ్ట్ వరకు చేరుకుంది. పోలీసులు ఆమెను కూడా అరెస్టు చేసి, ఇద్దరిపై అక్రమ ప్రవేశం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మే 20న ఉదయం 9:45 గంటల సమయంలో జితేంద్ర కుమార్ సింగ్ సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అక్కడి భద్రతా సిబ్బంది అతడిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించగా, జితేంద్ర కోపంతో తన ఫోన్‌ను నేలకేసి విసిరేశాడు.

అదే రోజు సాయంత్రం 7:15 గంటల ప్రాంతంలో జితేంద్ర మళ్ళీ సల్మాన్ ఖాన్ ఇంటి వద్దకు వచ్చాడు. ఈసారి, గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మరో వ్యక్తి కారు వెనుక దాక్కుని లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకుని వెంటనే బాంద్రా పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు జితేంద్రను అదుపులోకి తీసుకుని విచారించగా, తాను సల్మాన్ ఖాన్ అభిమానినని, ఆయనను వ్యక్తిగతంగా కలవాలనుకుంటున్నానని చెప్పాడు. భద్రతా సిబ్బంది అనుమతించకపోవడంతో కారు వెనుక దాగి లోపలికి వెళ్లాలని ప్రయత్నించినట్లు తెలిపాడు. అతడి వద్ద ఎటువంటి ఆయుధాలు లేవని పోలీసులు నిర్ధారించారు. మరోవైపు మే 21న ఇషా ఛబ్రా (36) అనే మహిళ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఇటీవల సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 14న ఆయన ఇంటి వద్ద కాల్పుల ఘటన జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సల్మాన్‌కు 'వై ప్లస్' స్థాయి భద్రతను కల్పించింది. ఈ నేపథ్యంలో, ఈ అక్రమ ప్రవేశ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు ప్రేక్షకుల కోసం బూతులు తగ్గించాం..

### - 'రానా నాయుడు 2'పై రానా కామెంట్స్



నెట్‌ఫ్లిక్స్ వేదికగా రాబోతున్న పాపులర్ వెబ్ సిరీస్ రానా నాయుడు సీజన్ 2పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నటుడు రానా దగ్గుబాటి. రానా, విక్టరీ వెంకటేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ వెబ్ సిరీస్ సీజన్ 1కి కొనసాగింపుగా రాబోతుంది. కరణ్ అన్షుమణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ వెబ్ సిరీస్‌లో అర్జున్ రాంపాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. జూన్ 13న ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. బుధవారం టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా ఈ వేడుకలో రానా మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.రానా మాట్లాడుతూ.. 'రానా నాయుడు' మొదటి సీజన్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా మంది చూశారని, కానీ తెలుగు ప్రేక్షకులు మాత్రం పెద్దగా చూడలేదని రానా అభిప్రాయపడ్డారు. దీనికి ప్రధాన కారణం అందులో ఉన్న బూతులు, అధిక హింస అని ఆయన పరోక్షంగా అంగీకరించారు. ఈ నేపథ్యంలో, 'రానా నాయుడు' సీజన్ 2లో మార్పులు చేసినట్లు బూతులు తగ్గించి, హింస ఎక్కువ పెట్టాం అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మొదటి సీజన్‌లో అధిక శృంగారం, బూతు మాటలు ఎక్కువ ఉన్నాయని తెలుగు ప్రేక్షకుల నుండి విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. వీటిని దృష్టిలో ఉంచుకొని, రెండవ సీజన్‌లో మార్పులు చేయడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ కావాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు రానా మాటలు సూచిస్తున్నాయి. అయితే, బూతులు తగ్గించి హింసను పెంచడం ఎంతవరకు ఆదరణ పొందుతుందో చూడాలి.

## ఆంటీ పాత్రలు చేయడంలో తప్పేముంది?..

### 'డబ్బా రోల్స్' వివాదంపై స్పందించిన సిమ్రాన్



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ సిమ్రాన్ ఇటీవల చేసిన 'డబ్బా రోల్స్' వ్యాఖ్యలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఆమె మరోసారి స్పందించారు. తాను ఏ నటిని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదని.. కానీ తనతో ఒక నటి చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయని సిమ్రాన్ తెలిపారు. ఒక అవార్డు వేడుకలో సిమ్రాన్ మాట్లాడుతూ, తాను ఇటీవల ఒక సినిమా చూసి తన సహనటికి మెసేజ్ చేశానని, అందులో ఆమె నటన బాగుందని మెచ్చుకుంటూ మెసేజ్ పంపించానని చెప్పారు. అయితే దానికి ఆ నటి, "ఆంటీ రోల్స్ చేయడం కంటే ఇది ఎంతో బెటర్" అని సమాధానం ఇచ్చిందని సిమ్రాన్ తెలిపారు. ఈ మాటలు తనను బాధించాయని, పనికిమాలిన 'డబ్బా రోల్స్'లో నటించడం కంటే ఆంటీ లేదా 25 ఏళ్ల కూతురికి తల్లి పాత్రలు చేయడం ఎంతో బెటర్ అని సిమ్రాన్ వ్యాఖ్యానించారు.సిమ్రాన్ చేసిన 'డబ్బా రోల్స్' వ్యాఖ్యలు జ్యోతికను ఉద్దేశించే చేశారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ వ్యాఖ్యలపై మరోసారి స్పందించిన సిమ్రాన్ నటి పేరును మాత్రం బయటపెట్టలేదు.సిమ్రాన్ స్పందిస్తూ, తన కోస్టార్ చేసిన కామెంట్స్ తనను ఎంతగానో బాధించాయని, ఆ బాధతోనే అవార్డుల కార్యక్రమంలో తనకు అనిపించింది చెప్పానని తెలిపారు. కెరీర్ ప్రారంభం నుంచే అప్పుడప్పుడు ఆంటీ రోల్స్ లో నటిస్తూ వచ్చానని, ఆ రోల్స్ చేయడం తనకూ ఇష్టమేనని, ఆ పాత్రల్లో నటించడంలో తప్పేముందని ప్రశ్నించారు. "నేను నా 25వ ఏటనే 'కన్నతిల్ ముతమిట్టాల్' సినిమాలో తల్లి పాత్ర చేశాను. అలాంటి పాత్రలు చేయడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. పనికిమాలిన పాత్రలు చేయకుండా, మనకు నమ్మకం ఉన్న పాత్రలు చేయాలి. ఏ పని చేసినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి" అని సిమ్రాన్ అన్నారు.అంతేకాకుండా, సినీ పరిశ్రమలో హీరోయిన్లు ఎప్పటికీ ఒకరికొకరు స్నేహితులు కాలేరని, తనకు ఎదురైన అనుభవంతో అది మరోసారి రుజువైందని ఆమె పేర్కొన్నారు. స్నేహితులు అనుకున్నవారు కూడా కొన్ని సందర్భాల్లో తమ వ్యాఖ్యలతో బాధపెడతారని తెలిపారు. అవార్డుల కార్యక్రమంలో తాను మాట్లాడిన తర్వాత ఆ నటి తనకు మళ్లీ ఫోన్ చేసిందని, అయితే అంతకుముందు ఉన్న బంధం ఇప్పుడు లేదని సిమ్రాన్ స్పష్టం చేశారు.

# ఓడి గెలిచిన పుట్ట మధు..

- ఎన్నికల్లో ఓటమి
- ప్రజా సమస్యలపై పోరాటంలో విజయం..
- నిరాశలో సగటు కాంగ్రెస్ కార్యకర్త, అభిమాని..
- ఉద్యోగాలు ఇప్పిస్తే ఆ ఊళ్ళో ఓట్లు అడగనంటూ మంత్రికి సవాల్..

మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గం రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉన్న ప్రాంతం, ఇక్కడ రాజకీయాలు విభిన్నంగా ఉంటాయి. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పెద్దగా చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేవు అనడంలో సందేహం లేదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది మంథని పరిస్థితి. మంత్రి శ్రీధర్ బాబు పేరుకు ముఖ్యమంత్రి తర్వాత స్థానం, బాగా తెలివిగల మంత్రి అన్ని పనులు ఆయనే చేస్తాడు అంటూ ముఖ్యమంత్రి సైతం అనేక సందర్భాల్లో కొనియాడారూ... మా నాయకుడు చాలా గొప్పవాడు అంటూ బడాయిలు చెప్పుకున్నారు కార్యకర్తలు... కానీ ఏం లాభం కార్యకర్తల ఆవేదన అంతా ఇంతా కాదు కక్క లేక మింగలేక , చావలేక బ్రతక లేక కుమిలి కుమిలి పోతున్నారు. పది సంవత్సరాలు నిజాయితీగా పనిచేసిన మా జీవితాల్లో వెలుగు వస్తుంది, మా బ్రతుకులు బాగుపడతాయి అని సగటు కాంగ్రెస్ కార్యకర్త, శ్రీధర్ బాబు అభిమానులు భావించిన వారి ఆశలు నిరాశలయ్యాయి... శ్రీధర్ బాబు గెలిస్తే మాకు మంచి జరుగుతుందని కార్యకర్తల, అభిమానుల కుటుంబాల్లోనీ మహిళలు చిన్న చిన్న పిల్లలు సైతం పెట్టుకున్న ఆశలు నిరాశలయ్యాయి ఎక్కడ ఉంది నిజాయితీ, ఎక్కడ ఉంది న్యాయం అంటూ కష్టపడ్డ సగటు కాంగ్రెస్ అభిమాని,కార్యకర్త కడుపు రగిలి మాట్లాడితే అనగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మీకు మీ కుటుంబానికి విధేయత ప్రదర్శించడమే మేం చేసిన నేరమా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షంపై విమర్శలు చేయమంటారు, అది చేయమంటారు, ఇది చేయమంటారు... ఇలా మీకోసం ఎన్నో చేశాం... మాకు కష్టం వస్తే మాత్రం మీరు రారు... మరి మీకోసం మేం ఎందుకు ధర్నాలు చేయాలీ ,నిరసనలు చేయాలి, ప్రతిపక్షాలతో వైరుధ్యం పెంచుకోవాలి అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంత చేస్తే అధికారం వచ్చాక కనీసం మా పనులు చేయకుండా తిప్పించుకుంటూ ప్రతిపక్షాల పనులు చేస్తున్నారు ఇది తెరాస ప్రభుత్వమా అయ్యగారు అని అడుగుతున్నారు. ఎన్నికల్లో నాకు కొంతమంది సీక్రెట్ గా పనిచేశారు అంటున్నారు, మరి మేం ఏమి చేయలేదా దొరగారు...? అక్కడ ఉండి సీక్రెట్ గా పనిచేసినోడు రేపు ఇక్కడ ఉండి సీక్రెట్ గా అక్కడి వారి కోసం పనిచేయడా ...? ఈ లాజిక్ ఎలా మిస్ అయ్యారు సారు... మీ శాఖలో మంథని నియోజకవర్గ నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు పెట్టించారో జర చెప్పండి సారు అంటూ ప్రతిపక్ష నేత పుట్ట మధు బహిరంగంగా సవాల్ విసిరాడు... ఊరికి ఆరు ఉద్యోగాలు పెట్టిస్తే ఆ ఊరుకి ఓట్లు అడగడానికి రాను అంటూ వ్యాఖ్యానించాడు... మరి మీరు ఆ సవాల్ ను స్వీకరిస్తారా అంటూ సొంత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు. చిల్లరగాళ్లను నేను పట్టించుకోను, నా హోదా కాదు అంటున్నారు. మీ పెద్ద హోదా, మీ లాంటి గొప్ప వ్యక్తి మాకు ఎమ్మెల్యే, మంత్రి కావడం మా అదృష్టం సారు మీ స్థాయిలో ఇక్కడ అభివృద్ధి సంక్షేమం చేసి చూపించి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నాం అంటున్నారు కార్యకర్తలు.. సొంత పార్టీ ఎంపీకి గౌరవం లేకుండా ప్రోటోకాల్ పాటించకుండా జరుగుతున్న రాజకీయ పరిణామాలు బాధగా ఉన్నాయని, తప్పని పరిస్థితుల్లో మంత్రి మెప్పుకోసం ఎంపీ నీ విమర్శిస్తున్నామని కొంతమంది నేతలు మదనపడుతున్నారు. రాజకీయాలు ఏవైనా కావచ్చు ఈ విషయంలో తెరాస నేత పుట్ట మధు మా కాంగ్రెస్ ఎంపీకి జరిగిన అవమానం పై పోరాటం చేయడం గొప్ప విషయం అంటున్నారు లోలోన.. ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై, సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకొని మంత్రి శ్రీధర్ బాబుపై ఇంత వ్యతిరేకత రావడం కొంతమంది కార్యకర్తలు సైతం పుట్ట మధు బెటర్ అనే పరిస్థితి వచ్చింది అంటే..ఓడి గెలిచిన పుట్ట మధు అంటున్నారు కొందరు.





## పుట్ట మధును విమర్శించే స్థాయి నీది కాదు కొత్త శ్రీనివాస్ .



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును విమర్శించే స్థాయి నీది కాదని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ను బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కొండా రవీందర్, పుట్టపాక మాజీ సర్పంచ్ రొడ్డ శ్రీనివాస్ లు హెచ్చరించారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్పంచ్ గా ఓడిపోయిన వారిని సింగల్ విండో చైర్మన్ చేసింది ఎవరు కొత్త శ్రీనివాస కు బీఆర్ఎస్ నాయకుల స్కూటీ ప్రశ్నించారు. పుట్టపాక సర్పంచ్ గా ఓడిపోయిన కొత్త శ్రీనివాస్ ను సింగిల్ విండో డైరెక్టర్ గా గెలిపించి చైర్మన్గా చేసింది ఎవరని, పుట్ట మధు సహకారంతో సింగిల్ విండో చైర్మన్ గా సొంత ఇల్లు కట్టుకున్నావని, 6 నెలలకు ఒక వాహనాన్ని కొనుగోలు చేస్తున్నావని, ఇవన్నీ పుట్ట మధు పెట్టిన బిక్ష కాదా అని వారు ప్రశ్నించారు. పుట్ట మధు ఇచ్చిన సింగిల్ విండో చైర్మన్ పదవిని అనుభవిస్తూ ప్రెస్ మీట్ లో పుట్ట మధునే విమర్శిస్తావా అంటూ ఎద్దేవా చేశారు. పుట్ట మధు ను విమర్శించే స్థాయి నీది కాదన్నారు. ఇప్పటికైనా కొత్త శ్రీనివాస్ ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కొండ రవీందర్, మాజీ సర్పంచ్ రొడ్డ శ్రీనివాస్ మాజీ ఎంపిటిసి పెగడ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మయ్య, ఎరుకల రవి, బడికల సది, కారెంగుల సురేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే సత్యం పరామర్శ...! ప్రగాఢ సంతాపం..!!

- రూ.15 వేలు ఆర్థికసాయం అందజేత



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర శోభ అనే మహిళ విద్యుత్ షాక్ తో మరణించగా, ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి ,శ్రద్ధాంజలి ఘటించి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూస రవీందర్, బోయిని ఎల్లేష్ యాదవ్, మహేశ్వర్ రెడ్డి లతో కలిసి మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలిపి, వారి కుటుంబ సభ్యులకు రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు.

## ముక్కంటి ఆలయంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి ( ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు శాసనసభ్యులు జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేశారు వారిని దేవస్థానం డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దేవస్థానం ప్రధాన అర్చకులు స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు.అనంతరం శ్రీ మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులను శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు వేద పండితులు వేదమంత్రాలతో ప్రత్యేకంగా ఆశీర్వదించారు.దేవస్థానానికి విచ్చేసే భక్తులకు ఉచిత ప్రసాదంగా లడ్డును పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

## కొండగట్టు అంజన్న సేవలో...! రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది పూజలు...!!



వేములవాడ,(ప్రశ్న న్యూస్) హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జగిత్యాల జిల్లా,మాల్యాల మండలం, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆది శ్రీనివాస్ దీర్ఘకాలంగా ఆంజనేయ స్వామిని గాఢభక్తితో నమ్ముతూ ప్రతి సంవత్సరం స్వయంగా కొండగట్టును దర్శించే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం శాంతియుత వాతావరణంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## ప్రణాళికాబద్ధంగా వేములవాడ ఆలయ విస్తరణ పనులు

- ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్
- ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు ఉత్తర్వుల పంపిణీ
- 30 రోజుల్లోగా ఇంటి నిర్మాణం ప్రారంభించాలి
- పేదలకు భద్రత కలిగించే కార్యక్రమాలు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులు శృంగేరి పీఠం అనుమతితో ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో రెండో విడతగా మంజూరైన 484 ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, పేదల ఆత్మ గౌరవాన్ని పెంపొందించేలా ప్రభుత్వం ఇళ్ల కలను సాకారం చేస్తోందన్నారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసినా ఇళ్లు రాక నిరుత్సాహపడ్డ వారికి తొలివిడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. రాబోయే నాలుగేళ్లలో ప్రతి సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధిపై ఆయన స్పందిస్తూలి గత పాలకులు వంద కోట్ల రూపాయలు ఇస్తామని మోసం చేసినప్పటికీ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం గుడి అభివృద్ధికి వేయి కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపన చేసిందని తెలిపారు. గుడి చెరువులో మురుగు నీరు కలవకుండా తొమ్మిది కోట్ల రూపాయలతో చర్యలు చేపట్టామని, మూల వాగు శుభ్రపరిచే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. నిర్మాణ దశల వారీగా బేస్మెంట్కు రూ. 1 లక్ష, గోడలకు రూ. 1 లక్ష, స్లాబ్కు రూ. 2 లక్షలు, పూర్తయిన తర్వాత మరో లక్ష మొత్తం రూ. 5 లక్షలు మంజూరు అవుతాయని వివరించారు. ఇంటిచోటు లేని పేదలకు రెండో విడతలో ఇండ్లు ఖచ్చితంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలోనే తమ హయంలో అసైన్మెంట్ భూములు పేదలకు ఇచ్చామని, ప్రస్తుతం మళ్లీ అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి భూమిలేని వారికి స్థలాలు అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వేములవాడ పట్టణ పరిధిలో మంజూరైన 484 ఇండ్ల లబ్ధిదారులు 30 రోజులలోగా ఇంటి నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. పెట్టుబడిలేని పేదలకు మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ రాకేష్, సెస్ డైరెక్టర్ ఉమా, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా మేడిపల్లి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లు

- రాష్ట్ర స్థాయిలో 10 పోలీస్ స్టేషన్ లు ఎంపిక కాగా జగిత్యాల జిల్లా కు రెండు స్థానాలు
- మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు రెండవ స్థానం, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు ఆరవ స్థానం
- రాష్ట్ర డిజిపి జితేందర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్న పోలీసు అధికారులు
- ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పి అశోక్ కుమార్



జగిత్యాల జిల్లా బ్యూరో (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లాకు చెందిన మేడిపల్లి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా ఎంపికయ్యాయి. తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ ఐపీఎస్ చేతులమీదుగా పోలీసు అధికారులు మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ప్రత్యేకంగా పోలీసు అధికారులను అభినందించారు. ప్రజలకు, బాధితులకు మెరుగైన సేవలను అందించేందుకు పోలీస్ శాఖ గురించి, స్టేషన్లలోని సిబ్బంది గురించి ప్రజలేమనుకుంటున్నారు.

పోలీస్ స్టేషన్లలో ప్రజలకు సరైన ఆదరణ, సేవలు లభిస్తున్నాయా, ఫిర్యాదు దారులతో సిబ్బంది ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు. అనే విషయాలు తెలుసుకోవడం కోసం ఓ క్యూఆర్ కోడ్ను రూపొందించారు. క్యూఆర్ కోడ్ ద్వారా పోలీసు సేవలపై ప్రజల నుండి వచ్చిన మొత్తం అభిప్రాయాల ఆధారంగా రాష్ట్ర స్థాయిలో 10 పోలీస్ స్టేషన్ లు ఎంపిక కాగా జగిత్యాల జిల్లా నుండి ఉత్తమ ప్రతిభ కనబరిచిన మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్ ,రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్, రాష్ట్ర స్థాయిలో ఆరవ స్థానం వచ్చి ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా లు గా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. హైదరాబాదులోని డీజీపీ కార్యాలయం నందు పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు. జగిత్యాల జిల్లా పోలీసు శాఖకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు తమ కృషి, నిష్ట, సమర్థతతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చి ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులను జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు.

# అక్రమ బోర్లతో అధికారులకు కాసుల పంట

## యథేచ్ఛగా అక్రమ బోర్లు అడుగంటుతున్న భూగర్భ జలాలు

- రోజురోజుకు పెరుగుతున్న అక్రమ బోర్ల సంఖ్య
- అనుమతుల విషయంలో తెలివిగా వ్యవహరిస్తున్న అధికారులు
- లంచాలు తీసుకొని ఇష్టారాజంగా అనుమతులు ఇస్తున్న భూగర్భ జలాల శాఖ





**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** మారేడ్ పల్లి, సికింద్రాబాద్, ముషీరాబాద్ మండల పరిధిలో రోజు రోజుకూ వేస్తున్న అక్రమ బోర్ల సంఖ్య పెరుగుతోంది. రెవిన్యూ భూగర్భ జలాల శాఖ అధికారుల నుంచి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా కొందరు బోర్లు వేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న బోర్లతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో పలు డివిజన్ లలో బోర్లు వేసుకునే వారు అధికమయ్యారు. అయితే ఈ బోర్లకు అనుమతులు ఇచ్చే విషయంలో సంబంధిత రెవెన్యూ, భూగర్భ శాఖ అధికారులు చాలా తెలివిగా అనుమతులు ఇస్తూ వ్యవహారం తమ వరకు రాకుండా జాగ్రత్తలు పడుతున్నారు. పలు కాలనీల్లో చిన్న చిన్న ఇళ్లతో పాటు పెద్దపెద్ద అపార్టుమెంట్ లలో అవసరమున్నా, లేకున్నా అక్రమంగా బోర్లు వేస్తున్నారు. అపార్టుమెంటు నిర్మాణం జరుగుతుందంటే అక్కడ అప్పటికే బోరు, నీటి సదుపాయాలు ఉన్నా మరొక బోరును తవ్వుతున్నారు. మధ్య తరగతి ప్రజలకు అనుమతులు ఇచ్చేందుకు వెనుకాడే అధికారులు బిల్డర్లకు మాత్రం కొమ్ము కాస్తున్నారని లంచాలు భారీగా తీసుకొని అధికారులు వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

### అనుమతులు నాలుగున్నర అంగుళాలే.. వేసేది ఆరున్నర అంగుళాలు

నగరంలో ఎక్కడ బోర్ వేసినా కేవలం నాలుగున్నర అంగుళాల సైజులో మాత్రమే తవ్వాలనే నిబంధనలున్నాయి. అలాగే 50 నుంచి 100 మీటర్ల లోతు వరకు నీరు పడని పక్షంలో మరింత లోతు తవ్వేందుకు గాను భూగర్భశాఖ నుంచి తిరిగి అనుమతులు పొందాల్సి ఉంది. కానీ నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. ఏకంగా ఆరున్నర అంగుళాల పైపులతో బోర్లు వేయడమే కాకుండా వేయి నుంచి రెండు వేల అడుగుల లోతు వరకు పైపులైన్లు వేస్తున్నారు. వాస్తవానికి గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఆరున్నర అంగుళాల బోరు వేస్తే తప్ప నీరు రాని పరిస్థితి నిబంధనలు తప్పుగా ఉండడంతో అది ప్రజలకు శాపంగా అధికారులకు లాభంగా మారింది దానిని అడ్డుపెట్టుకొని రెవిన్యూ భూగర్భ శాఖ అధికారులు లక్షలలో లంచాలు దండుకుంటున్నారు ఒక్కొక్క అధికారి కోట్లకు పడగలెత్తారంటే అతిశయోక్తి కాదు. నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేస్తున్న వారు చాలా మంది ఆదివారం లేదా ప్రభుత్వ అధికారులు అందుబాటులో లేని రోజుల్లో మాత్రమే బోర్లకు ముహూర్తం పెడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే వాడకో బోరు, వీధికో బోరు రిగ్గు తిరుగుతూనే ఉంటుంది. ఆర్ఐలు వచ్చి బోర్ల వద్ద సెటిల్మెంట్లు చేసుకొని ఎమ్మార్వోలకు వాటాలు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### నీరుగారుతున్న వాల్టా చట్టం..

భూగర్భ జలాలను పరిరక్షించేందుకు గాను 2002లో వాల్టా యాక్టు (వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్టు) అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారంగా భూగర్భ జలాలను పరిరక్షించాలని, అందుకు గాను హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో నిబంధనలకు లోబడి బోర్లు వేయాలని సూచించింది. అందుకు కొన్ని నిబంధనలు రూపొందించి వాటికి లోబడే బోర్లు వేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ వాల్టా చట్టానికి తూట్లు పొడిచి నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేస్తూ భూగర్భ జలాలను నాశనం చేస్తు న్నారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఇండ్లు నిర్మించుకునే వారికి వాల్టా చట్టం నుండి మినహాయింపు ఇవ్వాలని లేకుంటే ఇదే అదనుగా భూగర్భ శాఖ రెవెన్యూ అధికారులు దోపిడీకి ఎగబడ్డారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన తెలంగాణ ప్రభుత్వం స్పందించి బోర్లు వేసేందుకు పూర్తి విచారణ చేసి అనుమతులు ఇచ్చి, భూగర్భ జలాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

### తెలివిగా వ్యవహరిస్తున్న అధికారులు

బోర్లు వేసేందుకు అనుమతులు ఇచ్చే విషయంలో రెవెన్యూ, భూగర్భ జలాల పరిరక్షణ అధికారులు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా బోరింగు వేసుకునేందుకు అనుమతి కోరితే అతనికి అనుమతులు ఇస్తున్నారే తప్ప అందులో ఎన్ని ఇంచుల సైజు బోరు వేయాలని సూచించడం లేదు. దీంతో సదరు వ్యక్తులు అనుమతి ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని ఏకంగా ఆరున్నర ఇంచుల బోర్లును తవ్వుతున్నారు. ఇలా స్పష్టత లేని విధంగా అనుమతులు ఇవ్వడమేమిటని అడిగితే కేవలం తాము బోర్లు తవ్వేందుకు అనుమతులు ఇస్తామే తప్ప ఎన్ని అంగుళాలు ఉండాలనే విషయాలు మా పరిధి కాదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇదంతా భూగర్భ జలవనరుల శాఖ చూసుకుంటుందని రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. అయితే ప్రస్తుతం బోర్లు వేస్తున్న వారిలో చాలా మంది భూగర్భ శాఖ అనుమతులు లేకుండానే బోర్లు వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ భూ యజమాని డొమెస్టిక్ బోరు కి అనుమతి తీసుకొని కమర్షియల్ గా ఆరున్నర ఇంచుల బోరు వేయడం జరిగింది. ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని బోరు బండి ని ఆపేశారు. ఈ అక్రమ బోర్ విషయమై మారేడ్ పల్లి మండల తహశీల్దార్ భీమయ్య గౌడ్ ని సంప్రదించగా అక్రమబోరుని సీజ్ చేస్తామని వివరించారు. కానీ సాయంత్రం ఆరు గంటల వరకు కూడా ఎటువంటి చర్యలు చెప్పట్టకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా రెవెన్యూ అధికారులు చర్యల పేరుతో సొమ్ము చేసుకుంటున్నారని ఎక్కడైనా బోరు వేశారంటే రెవెన్యూ అధికారులకు స్థానిక రిపోర్టర్లకు కాసుల పంట పండుతోంది. నీరు ప్రతి ఒక్కరికి అవసరమని బోరింగ్ ల వద్దకు పోవద్దని తెలిసి కూడా కొంతమంది రిపోర్టర్లు అధికారులు పోవడం సిగ్గుచేటని ప్రజలు మండిపడుతున్నారు.

# జగిత్యాలలో ఆర్ఎంపీ పిఎంపీ క్లినిక్స్ పై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ దాడులు



**జగిత్యాల జిల్లా బ్యూరో (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ లాలయ్య, చైర్మన్ మహేష్ కుమార్ దాడులు ఆర్ఎంపీ పిఎంపీ క్లినిక్స్ పై జరిపారు. ఇష్టా రాజ్యంగా యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ పేషెంట్ లకు ఇస్తున్నట్టు తెలిపారు. లింగనిర్ధారణకు, అబార్షన్లకు వెనుకాడరు అని తెలిపారు. 10 మంది పై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) :** జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఉన్నతాధికారులను సిఎస్ ఆదేశించారు. ఈ వేడుకలకు కావలసిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు గురువారం ఉన్నతాధికారులతో డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమావేశమై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. గౌరవనీయులైన ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్ కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ మరియు సైనేజెస్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు.సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని దీంతో పాటు జనరేటర్ బ్యాకప్ కూడా ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ కమిషనర్ ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. డిజిపి జితేందర్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, సమాచార పౌర సంబంధాల కమిషనర్ హరీష్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రెండు సంవత్సరాల తర్వాత
# అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

- అక్రమ నిర్మాణాలను ఎప్పటికైనా కూల్చివేస్తాం డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావు
- నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేయండి తేడా వస్తే చర్యలు తప్పవు ఎసిపి
- రెండు సంవత్సరాల తర్వాత అయిన ఏసీపి బాల శ్రీనివాస్ స్పందించడం సంతోషం
- గత టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది లంచాల దాహంతోనే అక్రమ నిర్మాణాలు





**సీతాఫలమండి (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ఎట్టకేలకు టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు ఇటీవల ప్రజావాణి కార్యక్రమంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో వాటిని వదిలేసి రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన అక్రమ నిర్మాణాలపై ఇప్పుడు కూల్చివేతలు చేయడం సికింద్రాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశంగా మారింది అప్పట్లో విధులు నిర్వహించిన సెక్షన్ ఆఫీసర్ ఏసిపి ఈ రెండు అక్రమ నిర్మాణాల యజమాన్యులతో చేతులు కలిపి కనివిని ఎరగని రీతిలో రహదారిపైనే ఏడు అంతస్తుల అక్రమ నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత గురువారం డిప్యూటీ కమిషనర్ నూడల్ ఆఫీసర్ సుభాష్ రావు ఆదేశాలతో ఎసిపి బాల శ్రీనివాస్ సిబ్బందితో కూల్చివేతలు చేపట్టారు. అయితే రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ అక్రమ నిర్మాణాన్ని అప్పుడు ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా సొమ్ము చేసుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏసీపీ బాల శ్రీనివాస్ ప్రత్యేక ఫిర్యాదులు ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు చేపట్టారు అయితే ప్రస్తుతం అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని కూడా కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు ప్రస్తుతం లాలాపేట బౌద్ధ నగర్ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని కూల్చివేయాలని దీనిపై జోనల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు చైన్ మెన్లు పూర్తి సహకారం అందిస్తున్నారని భారీగా లంచాలు తీసుకొని వాటిని ప్రోత్సహిస్తున్నారని ఇక్కడ విధులు నిర్వహించే చైర్మన్ లను వెంటనే వేరే జోన్ కు లేదా నగర శివారులో ఉన్న మున్సిపాలిటీలకు బదిలీ చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ట్విట్టర్ (ఎక్స్)ను పట్టించుకోని
# జిహెచ్ఎంసి అధికారులు

- ప్రజలు సమస్యలపై ఎక్స్ లో ఫిర్యాదు చేస్తే స్పందించరు
- ఆధునిక సాంకేతిక పరజ్ఞానాన్ని పక్కన పెట్టిన రేవంత్ సర్కార్
- రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో జిహెచ్ఎంసి అధికారుల రూటే సపరేటు
- రేవంత్ సర్కార్ పై వ్యతిరేక పెంచడానికె అధికారుల ప్రయత్నమా
- అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

అధికారుల అవినీతి పై పాలకులు స్పందించకుంటే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత తప్పదు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అక్రమాలపై పోరాటం చేసి బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అవినీతిని అక్రమాలను ప్రజల్లో ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి కృషి పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం లో అధికారం చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఎన్నో అవినీతి అక్రమాలు అన్యాయాలపై పోరాడిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అధికారులు చేస్తున్న అవినీతి అక్రమాలను ఎండగట్టడం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం చెందారు. అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నందు టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రజల నుండి ఎన్నో ఫిర్యాదులు, దినపత్రికల్లో కథనాలు వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్న జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ లో అధికారుల అండదండలతో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ,ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న, వందల కోట్ల ప్రభుత్వానికి దోచుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనకాల ఆంతర్య ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంలో ప్రజలు ట్విట్టర్ ద్వారా తమ సమస్యలు తెలిపిన అక్రమ నిర్మాణాల పై ఫిర్యాదు చేసిన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు మున్సిపల్ శాఖ మంత్రి సమాధానాలు ఇచ్చేవారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు,



సిటీ చీఫ్ ప్లానర్, టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ మున్సిపల్ శాఖ మంత్రి కానీ (ఎక్స్) ట్విట్టర్ పై అసలు స్పందించడం లేదని తిరిగి ప్రజలకు సమాధానం తెలుపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు, గ్రేటర్ హైదరాబాదులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని, కాసులు కనబడితే టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణాలు కనపడవా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా గ్రేటర్ లో ఎన్నో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని దినపత్రికల ద్వారా ట్విట్టర్ ద్వారా టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిపిన కనీస స్పందన లేదని, సమాధానాలు తెలపడం లేదని, మున్సిపల్ శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యత నిర్వహిస్తున్న తన శాఖపై రేవంత్ రెడ్డికి అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తక్షణమే వాటిపై చర్యలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాల చేపడుతున్న సందర్భంలో ఆర్టిఏ ద్వారా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలను ఆర్టిఏ యాక్ట్ ప్రకారం అనుమతి పత్రాలు అడిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, నిర్మాణాలు చేపట్టే సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం రాజకీయ నాయకుల అండదండలతో అక్రమ నిర్మాణాలు చేపట్టడం కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలకడం, టౌన్ ప్లానింగ్ అధికారులకు కావలసిన కాసులు ముట్ట చెప్పడంతో అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజా పాలన ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు ప్రజా సంక్షేమ నికై పాటుపడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమకు అందిన కాడికి దోచుకొని దాచుకోవడం చూస్తుంటే ప్రభుత్వం ఇచ్చే జీతాల కంటే అక్రమ నిర్మాణదారులు ఇచ్చే అక్రమ సంపాదనే టౌన్ ప్లానింగ్ అధికారులకు కళ్ళముందు అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కళ్ళుండి చూడలేక పోతున్నారా.?గ్రేటర్ హైదరాబాదులో అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే హైడ్రా తరహా కఠిన చర్యలు చేపట్టాలని, అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలికే టౌన్ ప్లానింగ్ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588